AL - HILAL

నెలవంక

మాస పత్రిక

Vol 7, Issue: 52 February - 2011

مجلة الهلال (باللغة التلغوية) – ملحق مجلة البشرى



మానవ సహోదరుడు ముహమ్మద్ ﷺ



IPC

لجنة التعريف بالإسلام

ISLAM PRESENTATION COMMITTEE

جمعية النجاة الخيرية

ఉచితం



"భూమ్యాకాశాలను పుట్టించినవాడు ఆయనే. ఆయన మీ కోసం మీ నుండే మీ జతలను చేశాడు. పశువుల జతలను కూడా చేశాడు. ఈ విధంగా (ఇలలో) మిమ్మల్ని వ్యాపింపజేస్తున్నాడు. ఆయన్ని పోలిన వస్తువేదీ లేదు. ఆయన వినేవాడు, చూచేవాడు. భూమ్యాకాశాల తాళం చెవులు ఆయన అధీనంలోనే ఉన్నాయి. ఆయన తాను కోరిన వారికి ఉపాధిని విస్తృతంగా ఇస్తాడు. నిశ్చయంగా ఆయన ప్రతిదీ తెలిసినవాడు".

(దివ్య ఖుర్ఆన్- 42: 11,12)

"ఆయనే అల్లాహ్; మీ ప్రభువు. ఆయన తప్ప మరొకరెవరూ ఆరాధ్యులు కారు. సమస్త వస్తువులను సృష్టించినవాడు ఆయనే. కాబట్టి మీరు ఆయన్నే ఆరాధించండి. అన్ని విషయాల కార్యసాధకుడు ఆయనే. ఎవరి చూపులు కూడా ఆయన్ని అందుకోజాలవు. ఆయన మాత్రం అందరి చూపులను అందుకోగలడు. ఆయన సూక్ష్మ దృష్టి కలవాడు. సర్వమూ తెలిసినవాడు". (దివ్య ఖుర్ఆన్- 6: 102,103)

నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 7, ISSUE: 52
February 2011

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Sk. Habeebur Rahman Jamaee
Sk. Abdus Salam Omeri
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONE
Syed Abdus Salam Omeri
97248933

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

DESIGN
Nader Belal

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency
www.zukhruf.net
Tel. 99993072

ఈ సంచికలో....

వినాశకాలే విపరీత బుద్ధి	2
ఈ మార్పుకి మనం సిద్ధమేనా?	3
మానవ మహోపకారి ముహమ్మద్ (స)	4
కువైట్ ఆచార వ్యవహారాలు	9
అనురాగ రావం	10
ఈ సృష్టి నిర్వహణకర్త ఎవరు?	11
ఇస్లాం శిక్షణ	12
కవితా కుసుమాలు	13
ఖుర్ఆన్ వెలుగులో ప్రవక్త ఈసా	14
ఐపిసి వార్తలు	16
నెలవంకతో నా అనుబంధం	18
నేటి బాలలే రేపటి పౌరులు - 10	19
నెలవంక ఉత్తరాలు	20



సెకనుకి విలువ ఇవ్వలేనివారు నిమిషానికి విలువ ఇవ్వలేరు. కొన్ని నిమిషాలు వృధా అయితే కొన్ని గంటలు వేస్ట్ అయినట్టే లెక్క. అలాంటి కొన్ని గంటలు కలిస్తే ఒక రోజు! ఒక నెల! ఒక సంవత్సరం!! ఒక జీవితం!!!

మన అదృష్టం కొద్ది రోజుకి 24 గంటలు మాత్రమే ఉన్నాయి. వాటిని సద్వినియోగ పర్చుకోలేకపోతే రోజులు వాటంతట అవే గడిచిపోతూ ఉంటాయి. వెనక్కి తిరిగి చూసుకుంటే చేయవలసిన పనులు ఎన్నో మిగిలి ఉంటాయి. పూర్తి చేసిన పనుల మాత్రం కొన్నే కనబడతాయి.

ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మహా గొప్ప అనుగ్రహాలు రెండు. అత్యధిక శాంతం మంది ప్రజలు ఈ రెంటిని గురించి నిర్లక్ష్యానికి, ఏమరుపాటుకు గురై ఉంటారు. వాటిలో ఒకటి - ఆరోగ్యం అవగా, మరొకటి తీరిక సమయం".

الغلو لايأتي بخير | تعالوا نجدد فكرتنا | إنما بعثت رحمة مهداة | ثقافة الكويت | اساليب تربية النبي | أإلـه مع الله | تربية المهتدين | أناشيد (عن سيرة الرسول) | عيسى عليه السلام في ضوء القرآن | أخبار اللجنة | الهلال في ذاكرتي | روضة الأطفال | رسائل الهلال

వినాశకాలే విపరీత బుద్ధి

అతిశయిల్లడం అన్ని రంగాల్లోనూ అనర్థానికి దారి తీస్తుంది. విద్యా రంగమయినా, వైజ్ఞానిక రంగమయినా, ఆర్థిక రంగమయినా, ఆధ్యాత్మిక రంగమయినా, రాజకీయమయినా, రాజరికమయినా ఏదీ దీనికి అతీతం కాదు. సమతౌల్యత, సౌజన్యత, మధ్యేమార్గం అన్ని విధాలా శ్రేయస్కరం. సత్యాన్వేషణా దృష్టి, సత్యావిష్కరణ కృషి నేటి ముఖ్యావసరం. ఇవే సమాజాభ్యుదయానికి, దేశాభ్యున్నతికి ప్రాణం.

యజమానులు వ్యక్తి శ్రమశక్తిని వస్తువుగా మార్చి కార్మికుల హక్కులను కొల్లగొట్టడం ఒక విపరీతం. సంతానం తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం, తల్లిదండ్రులు సంతాన సేవల్ని గుర్తించకపోవడం రెండూ విపరీతాలే. గురువు శిష్యుల శ్రేయాన్ని కోరకపోవడం, శిష్యులు గురువును గౌరవించకపోవడం రెండూ ప్రమాదకర విషయాలే. ధనం దైవ ప్రసాదితం కాదు, అది మా స్వయంకృషి ఫలితం అని శ్రీమంతులు అనుకోవడం, శ్రమను తమ నొసట వ్రాసిన శాపంగా పేదలు భావించడం రెండూ విపరీత ధోరణులే. దీనికి భిన్నంగా ఉన్నవారు లేనివారి అవసరాల్ని గుర్తించి మానవత్వంతో వ్యవహరించగలిగితే సర్వత్రా సంతోషాలు సప్త రంగుల హరివిల్లె వెల్లివిరుస్తాయి. శ్రేయ సామరస్యాల పూలు విరబూస్తాయి.

పరిశుద్ధ పోషకాహారాలు దేహపోషణకు ఎంత అవసరమో ఆరోగ్యకరమైన సాహిత్యం మేధో వికాసానికి అంతే అవసరం. అది మానవ మేధకు పదును పెట్టాలి. అయితే నేడు మార్కెట్‌లో లభించే చౌకబారు సాహిత్యం పాఠకులను పెడత్రోవ పట్టిస్తూ, ఊహాలోకాల్లో విహరింపజేస్తూ, క్రైం, సస్పెన్స్, సెక్స్, థ్రిల్లర్, హింస, విధ్వంసాలతో ఉత్కంఠ కలిగిస్తూ, క్షుద్ర విద్య, చేత బడులతో భయపెట్టుతూ పసలేని సమాచారాన్ని అందిస్తూ, తద్వారా పాఠకుల బలహీనతను సొమ్ము చేసుకోవడం అత్యంత విచారకరం! సాహిత్యం – అది ఎలక్ట్రానిక్ మీడియాకు చెందినదయినా, ప్రింటింగ్ మీడియాకు సంబంధించినదయినా, సినిమా రంగానికి సంబంధించినదయినా దాని మాధ్యమంతో డబ్బు కూడబెట్టుకోవాలనుకోవడంలో ఎవరి కారణాలు ఎలా ఉన్నా, తన స్వార్థం కోసం విష భావాలను విరజిమ్మడం, ధనార్జనార్థం ప్రజలను మరింత అజ్ఞానాంధకారాల్లోకి నెట్టడం ముమ్మాటికీ ఖండించదగిన విషయమే. మంచిని చేయడం సాధ్యం కాదనుకునే కుమతులు చెడు చేసే హక్కు కూడా తమకు లేదన్న విషయాన్ని గ్రహించాలి.

కోరికలు మానవ సహజాంశాల్లోని ఓ భాగమే కావచ్చు. అయితే అవి శ్రుతి మించకుండా ఉండేటట్లు చూసుకోవడం నేటి అవసరం. దక్షిణాఫ్రికా గణాంకాల ప్రకారం ప్రపంచంలో అత్యాచారానికి గురువుతున్న మహిళల సంఖ్య అక్కడ ఎక్కువ. ఎయిడ్స్ మహమ్మారి విజృంభణ కూడా అక్కడే అధికం. దక్షిణాఫ్రికా తర్వాత స్థానం భారత దేశానిదేనన్నది విశ్లేషకుల అంచనా. అంటే ఇక్కడ కూడా 'సెక్సువల్ హెరాస్మెంట్', మరియు లైంగిక అత్యాచార బాధితుల సంఖ్య ఎక్కువ ఉన్నట్లే కదా! ఈ విపరీత ధోరణి వెరసి భవిష్యత్తులో ఎయిడ్స్ రోగుల సంఖ్యను గణనీయంగా పెంచే ప్రమాదం లేకపోలేదు.

అలాగే ఈనాడు విదేశాల్లో నివసించడం, విదేశాల్లోనే విద్యనార్జించడం ఉన్నతమైన నాగరికతగా పరిగణించబడుతోంది. ఆంగ్ల భాషాభ్యసనాన్ని నవనాగరికతకు చిహ్నంగా భావించబడుతోంది. ఆంగ్లంలో మాట్లాడితే 'గౌరవం' అన్న వెర్రి ప్రబలుతోంది. కొందరయితే మాతృభాషలో కాకుండా ఆంగ్లంలోనే ఆలోచించే స్థాయికి ఎదిగి (?) పోయారు. అలా అని ఆంగ్ల భాషను తక్కువ చేసి చూపడం మా ఉద్దేశం కానేకాదు. భాషలన్నీ దైవం ప్రసాదించినవే. ఏ భాష ప్రాముఖ్యత ఆ భాషకుంటుంది. కానీ మాతృభాషను విస్మరించటం విపరీతం.

ఇవి, ఇటువంటి అనేక రుగ్మతలు నాగరికతగా, మనిషి స్వేచ్ఛకు సంపూర్ణ రూపాలుగా ఎంచబడుతున్నప్పుడు, ప్రకృతి వైద్యం తప్పనిసరి అవుతుంది. అనాదిగా ఆ ప్రకృతి వైద్యాన్ని అందిస్తూ, మానవాళిని సకల రుగ్మతల నుండి కాపాడుతూ వస్తున్న వైద్యుల్లో అంతిమ వైద్యుడు మహా ప్రవక్త ముహమ్మద్ (స). ఆయన రాకతో అనంత మానవ ప్రపంచంలో ఝంఝూ మారుతాలు ప్రవేశించాయి. ఆయన తన సునిశిత, సౌజన్య, సుశీల ప్రవర్తనతో, శక్తివంతమైన ప్రబోధనంతో మానవ సమాజంలో మహా గొప్ప నైతిక, ఆధ్యాత్మిక, ఆర్థిక, రాజకీయ విప్లవాన్ని తెచ్చారు. నేటి మానవ సమాజపు సకల రుగ్మతల నివారణోపాయం ఆయన ఆదర్శ జీవితంలోనే ఉంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. అది వినా మార్గాంతరం కూడా లేదు. ఆ మాటకొస్తే ఆయన ప్రభవనానికి గల కారణం కూడా అదే–

"ఆ ప్రవక్త (ముహమ్మద్ (స)) మంచిని చెయ్యమని వారికి ఆదేశిస్తాడు. చెడుల నుండి వారిని వారిస్తాడు. పరిశుద్ధమైన వస్తువులను ధర్మసమ్మతం (హలాల్)గా ప్రకటిస్తాడు. అశుద్ధమయిన వాటిని నిషిద్ధంగా ఖరారు చేస్తాడు. వారిపై ఉన్న (అనవసర ఆంక్షల) బరువును దించుతాడు. వారికి వేయబడిన ఉన్న సంకెళ్ళను త్రెంచుతాడు (ఇదే ఆయన ప్రభవనానికి కారణం). కనుక ఎవరు ఈ ప్రవక్తను విశ్వసించి, ఆయనకు ఆదరువుగా నిలుస్తారో, తోడ్పాటునందిస్తారో, ఇంకా అతనితోపాటు పంపబడిన జ్యోతి (ఖుర్‌ఆన్)ని అనుసరిస్తారో వారే నిజ సాఫల్యవంతులు". (అల్ ఆరాఫ్: 157)

సయ్యిద్ అబ్దుస్సలాం ఉమ్రీ

ఈ మార్పుకి మనం సిద్ధమేనా?

- శాంతి ప్రియ

"నిజాయితీగా బ్రతుకు...నిన్ను చూసి లోకం గర్వపడేలా బ్రతుకు...హితం కోసం పని చేయి...సాటి వ్యక్తుల యెడల దయ, క్షమ కలిగి ఉండు... దారిన పడివున్న హానికర వస్తువును తొలగించు... తల్లిదండ్రులతో మంచిగా వ్యవహరించు... పెద్దల్ని గౌరవించు... పిల్లల్ని ప్రేమించు.." అంటూ సజ్జనులైన మన పూర్వీకులు ఉగ్గుపాలతో పిల్లలకి రంగరించి ఇచ్చేవారు. ప్రస్తుతం ఇటువంటి మంచి మాటలు చెప్పేవారు, తప్పు చేస్తూ ఉండగా చూసి దండించేవారు, దండిస్తే సహించేవారు అరుదు. ఉన్న సమయమంతా కలల సౌధాలు నిర్మించుకోవడానికి, సొంత సౌఖ్యాలకే సరిపోతుంటే ఇక సమాజ సేవ శ్రేయోకాముక, విలువల సంరక్షణ ఎక్కడ? ఎటు చూసినా ద్వంద్వ ప్రవృత్తి ప్రబలుతుంది. 'లోపల ఒక విధంగా బయట మరో విధంగా' అన్న చందాన వ్యవహరిస్తున్నారు.

సామాజిక రుగ్మతలపై గంటల తరబడి ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే ఉత్తములు తమ విషయానికి వచ్చేసరికి నీతి నిజాయితీల్ని మర్చిపోతున్నారు. "ఈ కాలం కుర్రాళ్ళకి గురువు పట్ల గౌరవభావమే లేదు. అదే మా కాలంలో అలా ఉంటే, తోలు వలిచేవారు" అంటాడు తన ట్యూషన్ కుర్రాళ్ళకి ఎక్కువ మార్కులేసే ఒక ఉపాధ్యాయుడు. "ఈ దేశంలో కుళ్ళు రాజకీయాలు ఉన్నంత కాలం ఈ దేశం బాగుపడదు" అంటాడు బస్సులో ప్రయాణం చేస్తూ **'పొగ త్రాగరాదు'** అన్న బోర్డు క్రింద నిలబడి సిగరెట్ కాల్చే కుర్ర ప్రయాణికుడు. "ఈ కాలం అమ్మాయిల్ని చూస్తుంటే వీళ్ళకి అసలు శీలం పట్ల నమ్మకం ఉందా అనే అనుమానం కలుగుతుంది" అంటుంది అందాల పొటీలకు అధ్యక్షురాలైన ఆడపడచు."పై ప్లాటు వారు మా ఇంటి పేరట్లోకి తొక్కు విసిరేస్తారు. వారికి సివిక్సెన్స్ లేదు, పశువులు" అంటాడు వీధిలో చెత్త పడేసే క్రిందివాడు. చిత్రం ఏమిటంటే సమాజం పాడయిపోయిందని, ప్రజలు భ్రష్టు పట్టి పోయారని, విలువలు వలువలు వీడుతున్నాయని, మంచికి కాలం లేదని వీరు తెగ బాధ పడిపోతుంటారు కూడా. ఒక్క క్షణం తాము కూడా ఆ సమాజం అంతర్భాగమేనన్న నిజాన్ని వీరు గ్రహించరు. ఇలా ప్రతి వ్యక్తీ సమాజం పాడయిపోయింది అని విమర్శిస్తూ ఉంటాడే తప్ప, తనలోని లోపాన్ని తెలుసుకోడు. ఈ లోకంలో చాలా మంది ఎదుటి వారిలో ఎన్ని లోపాలున్నాయో చక్కగా చెప్పగలరు. కానీ తమలోని లోపాలను తెలుసుకోవడానికి ఇష్టపడరు. చెప్పినా వినరు. పైగా వాటిని సమర్థించుకునేందుకు వీర ప్రయత్నం చేస్తారు.

"చెప్పేందుకే నీతులు పాటించేందుకు కావు" అని నమ్మే ఇటువంటి వారిని ఉద్దేశించి దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: **"ప్రజలు నాశనమై పోయారు, ప్రజలు భ్రష్టుపట్టి పోయారు అన్న వ్యక్తి నాశనమయ్యేవారిలో తానే అగ్రగణ్యుడు"** అన్న విషయాన్ని తెలుసుకోవాలి. (ముస్లిం)

సమాజం మారాలని కోరుకోవడం, సమాజ సంస్కరణ కోసం పాటుపడటం మంచిదే, మెచ్చుకోదగ్గదే. కానీ సమాజం మారేంత వరకూ మనం ఆగాలా? లేదా ముందు మనం మారేందుకు ప్రయత్నించాలా? అన్న ప్రశ్న ఎవరికి వారు వేసుకోవాలి. ఏది సులభం? మనం మారడమా? సమాజాన్ని మార్చడమా? ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

"ప్రజలకైతే మీరు మంచిని గురించి ఆదేశిస్తారు, కానీ మీ స్వయాన్ని మరచిపోతారే?! చూడబోతే మీరు గ్రంథ పారాయణం చేస్తారాయె. మరి ఆ మాత్రం ఇంగిత జ్ఞానం కూడా మీకు లేదా?" (అల్ బఖరా: 44)

సమాజం బాగుండాలంటే దానికి మూలమైన మనం బాగుండాలి. మన లాంటి అందరూ బాగుండాలి. అలా జరగాలి అంటే, దైవ విధేయతా మార్గాన్ని అనుసరించాలి. ఏమిటి దాని ప్రత్యేకత అంటారా?


అది దైవభక్తికి, మానవ ప్రేమకు పెద్ద పీట వేస్తుంది. దైవం యెడల భయాన్ని, భక్తిని, దాసుల యెడల దయను, క్షమను జనింఎ జేస్తుంది. ఏ విధమైనటువంటి ఒత్తిడి లేకుండానే మనిషి నైతిక నియమాలు నిర్వర్తించేలా ప్రేరేపిస్తుంది.

అది శుభాలన్నింటినీ, మేళ్ళన్నింటినీ పునాదులుగా తీసుకుని, అశాంతి, అలజడి, అశుభాలకి, చెడులకి అతీతమైన ఆదర్శ జీవన విధానాన్ని ప్రతిపాదిస్తుంది. ధర్మంపై నడవడమే కాదు, ధర్మ సంస్థాపనార్థం మానవాళిని ప్రేరేపించి అధర్మాన్ని అంతమొందిస్తుంది. అది లాంఛనప్రాయమైన ఆచారాలకు కట్టుబాట్లకు కట్టుబడి ఉండటాన్ని వ్యతిరేకిస్తుంది.

స్వార్థంతో కూడుకున్న అహంభావం, దౌర్జన్యం, మార్గవిహీనత, క్రమ శిక్షణా రాహిత్యం వంటి తామసిక గుణాల్ని ఆత్మ నుండి తొలగించి మనసును పరిశుద్ధ పరుస్తుంది. అది తన ఆశయాలకు అంకితమైనవారిని – విశ్వాసమూర్తులుగా, శాంతి కాముకులుగా, నిరాడంబరులుగా, సాహస వంతులుగా, ఆదర్శప్రాయులుగా, అసత్యం పట్ల ఎన్నటికీ రాజీ పడని వారిగా, పరలోక భీతి, స్వర్గ ప్రీతి గలవారిగా తీర్చిదిద్దుతుంది.

అది మనిషిలో నైతిక బాధ్యతను జనింప జేస్తుంది. ఆత్మ నిగ్రహాన్ని, ఆత్మాభిమానాన్ని, ఆత్మ విశ్వాసాన్ని, ఆత్మ విమర్శను పెంచుతుంది. అన్ని సమ యాల్లోనూ సకల సృష్టి తాల పట్ల సమ తౌల్య ప్రవర్తనను, సాత్విక ప్రేమను, కరుణను, దయను, క్షమను సృజిస్తుంది. నిస్వార్థ భావం, నిష్కల్మష న్యాయం, నిర్మల మనస్తత్వం వంటి మంచిని మాత్రమే అందజేసే మహోన్నత సుగుణాలను మనిషిలో పెంపొందిస్తుంది. ఇంతకీ ఆ మార్గమేమిటంటారా? అదే ఇస్లాం.





ఎస్.ఎమ్.మలిక్
smmallick@hotmail.com

మానవ మహోపకారి ముహమ్మద్ ﷺ

నేపథ్యం

ఆ సమాజం చీకటి సమాజం. అంతటా గాఢాంధకారం. బహు దూర తీరాలలో అక్కడక్కడ మిణుకుమిణుకుమనే జ్ఞాన కాంతి కానవచ్చినా అధికాంశం అంధకార మయం. జ్ఞానానికి మూలమయిన అక్షరం అప్పుడప్పుడు తళుక్కుమనే నక్షత్రం! మత భావాలు మూఢనమ్మకాల దొంతరలు. సామాజిక అవగాహనకు సూత్రం: "గళం గలవాడిదే బలం, బలం గలవాడిదే సుఖం, సుఖం గలవాడిదే అధికారం" అన్నది. సమాజం తరగతుల్లో విభాజితం: పాలకులు, స్వాములు, నాయకులు, కర్షకులు, దాసులు, బానిసలు,నౌకరులు, అధమాతిఅధములు! కులం, వంశం, వర్ణం, వర్ణం, తెగ, పగ, కక్ష, వివక్ష సమాజంలో ప్రధాన పాత్రధారులు; గుణం, సంస్కారం, సభ్యత, నాగరికత, నీతి, నిజాయితీలకు అక్కడక్కడ కడపటి స్థానం.

ఆ చీకటి ఎడారిలో విరిసింది వెలుగొందే ఒక రోజా. దాని ఘుమఘుమలే నేటికీ జన వనంలో ఆశల తెరలను నింపు తున్నాయి. ఆ పుష్పరాజమే ముహమ్మద్ (స)! ఆయన ఒక సందేశహరుడు, దైవ సందేశహరుడు, దైవ ప్రవక్త. తాను అంద జేసే సందేశం తన సందేశమన్నా, నవ సందేశమన్నా, ఆనాటికి ఆధునిక సిద్ధాంత మన్నా, ఆ వాతావరణంలో ఆయనకు ఎదురుగా నిల్చొని కాదని చెప్పగల వారెవరూ లేరు. కాని ఆయన అలా చెప్ప లేదు. ఇది అత్యంత ప్రాచీనమయిన సందేశమని, మానవాళి ఎంత పురాతన మయినదో ఈ సందేశమూ అంతే పురాతన చరిత్రగలదని ప్రకటించిన నిస్వార్థ యోధుడాయన. తన మాట, ఆ వాతావరణానికి ఎంతో వ్యతిరేకమయిన మాటే అయినప్పటికీ, ఎంతో సౌమ్యంగా, సమంజసంగా, సౌజన్యంగా, శాంతి పూర్వకంగా అందజేశారు.

ఏ మాయాగారడి వ్యవహారంగాగాని, ఏదో కొత్తగా కనిపెట్టిన సిద్ధాంతంగాగాని ఆయన దాన్ని ప్రతిపాదించలేదు. దైవం పంపగా వచ్చిన సందేశహరులందరూ, ప్రవక్తలందరూ అందజేసిన సందేశమే, మీ, మా, మన పూర్వీకులందరూ అను సరించిన సందేశమే ఇది అని చాటిన సహృదయుడు. అయినా ఆయన్ని జనం వ్యతిరేకించారు, ఏవేవో స్వార్థ ప్రయోజ నాలు ఆ సందేశం వెనుక ఉన్నట్లు దుష్ప్ర చారం చేశారు. ఎన్నెన్నో దుష్ట సంకల్పాలు ఆయనకు అంటగట్టారు. ఏ మాత్రం నీతి పట్ల నమ్ముకున్న వ్యక్తి అయినా, ఏ కొంత సౌజన్యశీలత ఉన్న సుహృదయుడయినా, ఏ కాస్త సామంజస్యత, హేతుబద్ధత గల బుద్ధిమంతుడయినా ఆనాడు ఆ వ్యతిరేక తకు, ఈ సందేశానికీ ఏమయినా సంబంధముందా అని ఆశ్చర్యపోగలడు. ఆ పిలుపుకు, ఆ ప్రజల వైఖరికీ మధ్య గల తేడాను ఇట్టే గ్రహించగలడు కూడా!

> ఖుర్‌ఆన్‌లోని వచనాలు ఎంతో మనోజ్ఞంగా, మనోహరంగా, కర్ణపేయంగా ఆంతర్యంలోకి చొచ్చుకుపోయేవి. మనిషిలో సత్యప్రియత లేశమంత ఉన్నా, అజ్ఞానపు అపమార్గాల ఆకర్షణ అతన్ని లోబరచుకోకపోతే, అతను మనోకాంక్షలకు పూర్తిగా లొంగిపోయిన వ్యక్తి కాకపోయినట్లయితే ఆ సందేశం, ముహమ్మద్ (స) సందేశంలోని సత్యత అతన్ని ప్రభావితం చేయక మానదు.

ఆ మహనీయుడు, ముహమ్మద్ (స) అందజేసిన సందేశానికి ఆ దేశ ప్రజలు అలా తీవ్రంగా స్పందించి వ్యతిరేకించ డానికి కారణమేమిటీ అని నేడు మనమూ ఆశ్చర్యపోతాము. దాన్ని ఆకళింపు చేసు కోవడానికి ఆ సందేశమేమిటో, నాటి పరిస్థితులేమిటో, కాస్త తెలుసుకునే ప్రయత్నం చేస్తే అంతా స్పష్టమవుతుంది.

మలుపు

ఆయన అందజేసిన సందేశమిదే:
ఈ నిఖిల సృష్టికి ఒక కర్త ఉన్నాడు. ఆయనే దీనికి స్వామి, ఆయనే దీనంతటికీ ప్రభువు. ఆయనే దీనికి పాలకుడు. అందు వల్ల ఆయన ముందరే తల వంచాలి, ఆయనకే మోకరిల్లాలి, ఆయన్నే ఆరాధిం చాలి, ఆయన్నే పూజించాలి, ఆయన ఆజ్ఞలనే శిరసావహించాలి, ఆయన ఆదేశాల ప్రకారమే జీవించాలి.

ఈ సందేశానికే ఆ మూఢ ప్రజలు ఉలిక్కి పడ్డారు. తమ పూర్వీకులు పూజిస్తూ వచ్చిన నక్షత్రాలను, నదీనదాలను, వృక్షాలను, పర్వతాలను, దేవతలను, విగ్రహాలను తిరస్కరించాలా? వంశాను గతంగా వస్తున్న పూజారులు, పురోహి తుల మాటలను త్రోసిపుచ్చాలా? మా నమ్మకాలకు, మా ఆచారాలకు మేము ఎటువంటి సామంజస్యతను చూపలేక పోవచ్చు. అంత మాత్రాన మా ప్రాచీన విశ్వాసాలను వదులుకోవాలా?? మా వంశం, మా కుటుంబంలో ఎప్పటి నుంచో వస్తున్న ఆచారాలను కాదని, మా సమాజంలో అనాదిగా పాటించబడే నియమాలను తిరస్కరించి, మా మనస్సు కోరే అనేకానేక ఆకాంక్షలను వదలిపెట్టి ఈయనగారు చెప్పే, దైవాదేశాలని తెలిపే అంశాలు హేతుబద్ధమైన విషయాలే కావచ్చు, వాటినే సత్యాలని విశ్వసిం చాలా?

ఒక జాతి శతాబ్దుల తరబడి తీవ్రమయిన అజ్ఞానం, మూఢత్వం, పతనావస్థ, దురవస్థలకు, వెనుకబాటుకు లోనయి ఉంది. అవిద్య, అనాగరికత, అవ్యవస్థ, అసభ్యతలకు ఆలవాలమయి అలరారు తోంది. అటువంటి అనిర్వచనీయమయిన స్థితిలో అకస్మాత్తుగా సృష్టికర్త, విశ్వపాలనా ధీశుడు, నిఖిల జగతి ప్రభువు కటాక్ష

> ఈ నిఖిల సృష్టికి ఒక కర్త ఉన్నాడు. ఆయనే దీనికి స్వామి, ఆయనే దీనంతటికీ ప్రభువు. ఆయనే దీనికి పాలకుడు. అందు వల్ల ఆయన ముందరే తల వంచాలి, ఆయనకే మోకరిల్లాలి, ఆయన్నే ఆరాధించాలి, ఆయన్నే పూజించాలి, ఆయన ఆజ్ఞలనే శిరసా వహించాలి, ఆయన ఆదేశాల ప్రకారమే జీవించాలి.

వీక్షణం ఆ జాతిపై పడుతుంది. ఆయన కారుణ్యం కదలుతుంది. ఆ ఎడారి నేల పైన చల్లని జల్లులు కురుస్తాయి. వారిలో ఒక ఉత్తమ నాయకుడు ఆవిర్భవిస్తాడు. విశ్వప్రభువు, స్వామి ఆ జాతిని సముద్ధ రించి, చీకటి కుహరాల నుంచి వెలికి తీసి, వెలుగు శిఖరాలపైకి ఎక్కించడానికి స్వయంగా తన వచనాలను, స్వయంగా తన సందేశాన్ని, స్వయంగా తాను ఆమో దించిన మార్గాన్ని ఆ నాయకుడికి అంద జేస్తాడు. తద్వారా ఆ జాతి ఏమరుపాటు నుండి మేల్కొనాలని, మూఢ నమ్మకాల చక్రవ్యూహం నుండి బయట పడాలని, సత్యాన్ని గ్రహించి జీవితపు రాచబాటను అనుసరించాలని ఉద్దేశిస్తాడు.

కాని ఆ జాతి ప్రజలు అవివేకులు; స్వార్థ పరులయిన తెగల, వర్గాల చిల్లర నాయ కులు, దైవం పంపిన ఆ నాయకుని వెంటాడుతారు, ఆయన ఉద్యమం నిష్ఫలం అవ్వాలని శాయశక్తులా ప్రయత్నిస్తుం టారు. ఆయన మార్గంలో ఎనలేని అవ రోధాలు సృష్టిస్తూ ఉంటారు. ఆయన పట్ల దుష్ప్రచారానికి వెరువరు. అనుదినం వారి వైషమ్యం పెరుగుతూనే ఉంటుంది. వారి దౌష్ట్యం అంచెలంచెలుగా ఎక్కువవుతూనే ఉంటుంది.

దుర్మార్గులు ఆ నాయకుని అంతమొందిం చాలని కూడా కుట్ర పన్నుతారు. అటు వంటి పరిస్థితిలోనూ ఆ మహనీయుడు అంటాడు:
"మీ ఈ అవివేకం వల్ల మిమ్మల్ని సంస్కరించే కార్యాన్ని నేను వదలు కుంటానని అనుకుంటున్నారా? మీకు అందజేస్తున్న హితోపదేశాన్ని, గుణ పాఠ ప్రబోధనాన్ని అందజేయడం మాను కోవాలా? మీరు శతాబ్దులుగా పడి ఉన్న మీ పతనావస్థలోనే మిమ్మల్ని ప్రగ్గుతూ ఉండేందుకు వదలి పెట్టాలని కోరుకుంటున్నారా? కారుణ్య ప్రభువయిన దేవుని కారుణ్యం కోరేది, దాని ఆవశ్యకత కూడా ఇదే అని మీరు తలుస్తున్నారా? దైవానుగ్రహాన్ని వదలి వేయడం, సత్యం ప్రత్యక్షమయిన తరు వాత, మిథ్యను పట్టుకు వ్రేలాడటం, మిమ్మల్ని ఎటువంటి పరిణామానికి గురి చేస్తుందో ఎప్పుడయినా ఆలోచిం చారా?"
"ఇక మీ వైఖరికి బేజారెత్తిపోయి మేము ఈ హితోపదేశ ప్రబోధాన్ని మీకు అంద జేయడం మానుకోవాలా? కేవలం మీరు హద్దులు మీరిన జనం అవడం చేతనే ఇటువంటి అంతిమ నిర్ణయం గైకొనాలా?" (దివ్యఖుర్‌ఆన్– అల్ జుఖ్రుఫ్: 5)

ఆయన తన సందేశాన్ని దైవ గ్రంథం రూపంలో అందజేస్తున్నాడు. ఆయన అందజేస్తున్న దివ్యవాణి, దైవగ్రంథం, ఖుర్‌ఆన్‌లోని వచనాలు ఎంతో మనోజ్ఞం గా, మనోహరంగా, కర్ణపేయంగా ఆంత ర్యంలోకి చొచ్చుకుపోయేవి. మనిషిలో సత్యప్రియత లేశమంత ఉన్నా, అజ్ఞానపు అపమార్గాల ఆకర్షణ అతన్ని లోబరచు కోకపోతే, అతను మనోకాంక్షలకు పూర్తిగా లొంగిపోయిన వ్యక్తి కాకపో యినట్లయితే ఆ సందేశం, ముహమ్మద్ (స) సందేశంలోని సత్యత అతన్ని ప్రభావితం చేయక మానదు.

నిజ ధర్మం

తన సందేశాన్ని ఆయన అతి స్పష్టంగా విశదీకరించాడు. పరమ ప్రభువు అల్లాహ్ ఒక్కడే ఈ విశ్వాన్నం తటికీ, మానవునికీ సృష్టికర్త, స్వామి, నిజప్రభువు కాబట్టి ఆయనే మానవుని సర్వాధికారి. మానవుని ధర్మాన్ని, శాసనాన్ని, విశ్వా సాలను, ఆచరణా నియమాలను ప్రతిపాదించడం ఆయనకే చెల్లు. సత్యా సత్యాలేవో తెలుపడం ఆయన బాధ్యతే, మరే శక్తికయినాసరే మానవునికి చట్టాన్ని ఇచ్చే యోగ్యత లేదు. ఏ మానవుడూ, మరే ఇతర శక్తీ ఈ సర్వాధికార సత్తా కలిగిలేరు. కడకు దైవప్రవక్తకు కూడా ఆ స్థానం దక్కదు. ఇదే ఆధారంగా పరమ ప్రభువు మానవులకు ఒక ధర్మాన్ని, అధి కారికంగా ఒకే ధర్మాన్ని ఆమోదించి ప్రసాదించాడు. అదే దైవ విధేయతా ధర్మం, ఇస్లాం.

> మానవాళితో నా సంబంధం సత్యం, న్యాయం ఆధారంగానే ఏర్పడుతుంది. సత్యం ఎటువైపు ఉంటే నేను దాని రక్షణ నిలబడతాను. సత్యం ఆశ్రయించిన వ్యక్తి పరాయివాడయినా, వ్యతిరేకి అయినా, విరోధి అయినా నేనతని రక్షణే నిలుస్తాను. సత్యవిరుద్ధమయిన మాటకు నేను విరోధిని. ఆ అసత్యవాది నా వాడు, నా సన్నిహితుడు, నా మిత్రుడు, నా బంధువు అయినా నేనతన్ని వ్యతిరేకిస్తాను. నేను అసత్యానికి విరోధిని.

ఈ ఒక్క ధర్మమే మానవులకు, సర్వ లోకాల్లోనూ ప్రవక్తల ద్వారా అంద జేయ బడుతూ వచ్చింది. ఏ ప్రవక్త అయినా సరే తనదంటూ ప్రత్యేక ధర్మాన్ని స్థాపించు కోలేదు. దేవుని ఈ ధర్మాన్నే ప్రవక్తలం దరూ ఆది నుండీ మానవాళికి దైవం తరఫున అందజేస్తూ, అనుసరిస్తూ, ప్రచారం చేస్తూ వచ్చారు. దాన్ని కేవలం అనుసరించడం, ప్రచారం చేయడం వరకే వారి బాధ్యత కాదు. వారు దాన్ని సంస్థా పించడానికీ బాధ్యులే. అదే కృషి వారం దరూ జీవితాంతం చేశారు.

మానవాళికి దైవం తన ప్రవక్తల ద్వారా అందజేసిన ఈ నిజ ధర్మాన్ని, ప్రవక్తల తరువాత వారి అనుయాయులూ తమ సమకాలీన మానవులకు అందజేస్తూ వచ్చారు. ఆ క్రమంలోనే అనుయా యుల్లోని స్వార్థపరులయిన వారు, తమ స్వప్రయోజనాలు, స్వీయ ఇష్టాయిష్టాలు, స్వీయో త్కర్షల కారణంగా దైవ ధర్మాన్ని విభే దాలకు గురి చేశారు. అందులో విభిన్న వ్యత్యాసాలను సృష్టించారు. ఈ విభేదాలు, వ్యత్యాసాల ఆధారంగా విభిన్న వర్గాలు, మత వర్గాలు, మతాలు కల్పించారు. ప్రజల్లో ఏర్పడిన ఈ మతాలన్నీ ఆ ఒక్క దైవ ధర్మానికి వికృత రూపాలే. ఆ ధర్మాన్నే ప్రక్షాళించి, పునరుజ్జీవింపజేసి పునఃస్థాపించడానికి మహనీయ ముహమ్మద్ (స) ఆవిర్భవించారు.

"ఆదిలో మానవులంతా ఒకే సముదా యంగా ఉండేవారు; తరువాత వారు విభిన్న విశ్వాసాలు, పంథాలు రూపొం దించుకున్నారు. నీ ప్రభువు వద్ద తొలి నుంచే ఒక విషయం నిర్ణయమయి ఉండకపోతే వారు విభేదించుకుంటున్న విషయంలో తీర్పు చేసివేయబడేది."
(దివ్యఖుర్‌ఆన్- యూనుస్: 19)

విలక్షణ వ్యక్తిత్వం

ఇదీ మహనీయ ముహమ్మద్ (స) సందేశం. ఇదే ఆయన జీవిత ధ్యేయం, ఇదే ఆయన బోధించిన పరమార్థం. ఆయన స్వయంగా తన జీవితంలో ఈ దైవ ధర్మాన్ని సైద్ధాంతిక స్థాయిలో, ఆచరణ స్థాయిలో అవలంబించి, అనుసరించి తన ఆదర్శం ద్వారా అదే నిజ ధర్మమని నిరూ పించారు. తనను నమ్మి ఈ దైవ ధర్మాన్ని స్వీకరించిన వారిని సంస్కరించి, తీర్చిదిద్ది వారి వ్యక్తి గత జీవితాలను ప్రక్షాళించి, మెరుగు పరచి ఉత్తమ మానవులుగా రూపొం దించారు. వారి ద్వారా ఏర్పడిన సమా జాన్ని ఆదర్శ సత్సమాజంగా మలిచారు.

ఆయన నిరక్షరాసి. ఆయనకు చదవనూ, వ్రాయనూ తెలియదు. గ్రంథం అంటే ఏమిటో ఆయన ఎరుగడు. నలభయ్యేళ్ళ జీవితం అలాగే సాగింది. విశ్వాసాలు, వాదనలు,చర్చలు అసలే తెలియవు. కాని అకస్మాత్తుగా నలభయ్యేళ్ళ తరువాత గ్రంథాన్ని అందజేయడం, విశ్వాసాలను సుబోధకంగా వివరించటం, ఆధారాలు, నిదర్శనాలతో చర్చించడం, వాదించడం, ఆయన దైవ దౌత్యానికి, ప్రవక్తగా నియుక్తులయ్యారనడానికి అత్యంత పటిష్ట మయిన అఖండనీయ మయిన నిదర్శనం.

> న్యాయానికి చిహ్నం "మీజాన్" (తుల మానం, తరాజు, త్రాసు) అని, నేటికి రదిహేను వందల ఏళ్ళ క్రితం చాటింది, ఎత్తిచూపింది ప్రవక్త మహనీయుల (స) ద్వారా అందిన దివ్యఖురాన్ మాత్రమే అన్నది అఖండనీయమయిన సత్యం.

అయితే తాను అందజేస్తున్న గ్రంథం నిస్సందేహంగా దైవ గ్రంథమే, దైవ వచనమే, దైవ ప్రోక్తమే అయినప్పటికీ తాను దైవంతో ప్రత్యక్షంగా, ముఖా ముఖిగా మాటలాడానని ఆయన దావా చేయలేదు. ప్రవక్తలందరి మాదిరిగానే దైవం తనకూ దైవవాణిని పంపే తన మార్గాల ద్వారానే ఈ బోధనలు అంద జేశాడని విస్పష్టపర్చారు. ఈ తాత్విక జ్ఞానం, ఈ జీవన సంవిధానం, ఈ ప్రపంచ వ్యవహారాలన్నింటికీ సమా ధానం, తన ఆలోచనా ఫలితం కాదు దైవప్రసాదిత జ్ఞానం మాత్రమే అని అతి వినయంగా చాటుకున్నారాయన.

'మీ సహచరుడు దారి తప్పనూ లేదు, దారి వదలనూ లేదు. అతను తన మనోకాంక్షల ఆధారంగా ఏమాటా పలు కడు, ఇదయితే ఒక వహీ (దైవాణి), అతనిపై అవతరిస్తుంది. అతనికి జ్ఞాన బోధన గరిపిన వాడు మహాశక్తిమంతుడు, ఆయన మహా వివేచనాపరుడు".
(దివ్యఖుర్‌ఆన్- అన్ నజ్మ్: 2-4)

దేవుడు ఒక్కడే ప్రభువు, ఆయనే సకల పూజలకు అర్హుడు, అన్ని అక్కరలనూ తీర్చేవాడూ ఆయనే, అందువల్ల చట్టాన్ని అందజేసేవాడు, నియమాలను నిర్ధారించే వాడూ ఆయనే అనే మహనీయ ముహమ్మద్ (స) వాదనకు విస్తు పోయారు ప్రజలు. వారి ఆవేదన ఏమి టంటే అన్నీ చేసేవాడు దేవుడే అయితే మా మహనీయులు, మా ఊరి దేవతలు, ఇలవేల్పుల మాటేమిటీ అన్నది!



> ధర్మ ప్రచార కార్యం అత్యంత కష్టభూయిష్టమయినదే. అందులో నిరంతర పరిశ్రమ, అవిరళ కృషి తప్ప మరో ప్రత్యామ్నాయం, మాయలు, మంత్రాలు, తంత్రాలు అసలే లేవని ఖచ్చితంగా చెప్పివేశారు.

"అల్లాహ్ మాత్రమే మిమ్మల్ని సృష్టించిన వాడు, మీకు ఉపాధినిచ్చిన వాడు, ఆపైన మీకు మృత్యువునిస్తాడు, తిరిగి ఆయన మిమ్మల్ని బ్రతికిస్తాడు. అయితే మీరు కల్పించుకున్న సహవర్తులలో ఎవరయినా ఉన్నారా వీటలో ఏ ఒక్క పనయినా చేసే వారు? పరిశుద్ధుడాయన, వీరు చేసే బహుదైవోపాసనకు ఎంతో అతీతుడు".
(దివ్యఖుర్‌ఆన్- అర్ రూమ్: 40)

ఆయన తన మాటను, తన సందేశాన్ని, వాస్తవానికి దైవ సందేశాన్ని ఎన్ని విధాలుగా బోధపరచినా, ఎన్ని రకాలుగా నచ్చజెప్పినా, ఎన్ని ఆధారాలతో రుజువు పరచినా, ఎన్ని నిదర్శనాలతో నిరూపించినా ప్రజలు అర్థం చేసుకోవడం లేదే అని బాధపడేవారు మహనీయ ముహమ్మద్ (స). తిరస్కారుల మొండి పట్టుకు, మంకుతనానికి లోలోనే కుమిలి పోయేవారు. దైవం తన గ్రంథంలో ప్రవక్త శ్రీ (స)కి సాంత్వన వచనాలు పలికి ఓదార్చేవాడు.

"సరే ముహమ్మద్, వారు ఈ బోధనను విశ్వసించకపోతే, ఈ బాధతో వీరి వెన కాల బహుశా నీవు నీ ప్రాణాలనే ధార బోస్తావేమో".
(దివ్యఖుర్‌ఆన్- అల్ కహ్ఫ్: 6)

"ముహమ్మద్, బహుశా నీవు ఈ జనులు విశ్వసించడం లేదనే దుఃఖంతో నీ ప్రాణాలనే కోల్పోతావేమో. మేము కోరినట్లయితే ఆకాశం నుండి సూచనను అవత రింపజేయగలము, తద్వారా దాని సమక్షంలో వీరి మెడలు వంచేలా చేయ గలము". (దివ్యఖుర్‌ఆన్- అష్ షు,రా: 3,4)

దైవం కోరుకునేది, మానవులు స్వేచ్ఛగా, ఇష్టపూర్వకంగా సత్యాన్ని స్వీకరించాలన్నదే అనీ, తాము ఇష్టపడిన దాన్ని ఎన్నుకునే, అవలంబించే స్వాతంత్ర్యం ఇవ్వడం ద్వారానే మానవుల్ని పరీక్షించడం జరుగు తోందని అల్లాహ్ ప్రవక్త శ్రీ (స)కి బోధ పర్చాడు తన గ్రంథంలో. ధర్మ ప్రచార కార్యం అత్యంత కష్టభూయిష్టమయినదే. అందులో నిరంతర పరిశ్రమ, అవిరళ కృషి తప్ప మరో ప్రత్యామ్నాయం, మాయలు, మంత్రాలు, తంత్రాలు అసలే లేవని ఖచ్చితంగా చెప్పివేశారు.

"ఆదిలో మానవాళి అంతా ఒకే విధానాన్ని అవలంబించేది. (ఆ తర్వాత పరిస్థితులు మారగా విభేదాలు ఉత్పన్న మయ్యాయి) అప్పుడు అల్లాహ్ ప్రవక్తల్ని పంపాడు; వారు సన్మార్గావలంబనకు శుభ వార్త అందజేసేవారు, దుర్మార్గావలంబన పరిణా మం పట్ల భయపెట్టేవారు. వారితోపాటు, ప్రజల మధ్య సత్యం పట్ల పొడసూపిన విభేదాల తీర్పు చెయ్యటానికి సత్య విలసిత గ్రంథాన్ని అవతరింపజేశాడు - (ఈ విభేదాలు తలెత్తడానికి కారణం ఆదిలో జనానికి సత్యం ఏదో తెలుపక పోవడం కాదు) అలా విభేదించినవారు ఎవరో కారు, సత్యజ్ఞానం పొందిన వారే".
(దివ్యఖుర్‌ఆన్- అల్ బఖర: 213)

"ఆ తరువాత, ముహమ్మద్, మేము నీ వైపునకు ఈ గ్రంథాన్ని పంపాము. ఇది సత్యం తీసుకువచ్చింది. ఇది, దీనికి పూర్వం (గ్రంథాలలో) ఉన్న అల్ కితాబ్ (ఉద్గ్రంథం)లోని అంశాలను ధ్రువీకరి స్తుంది, వాటిని కనిపెట్టుకు ఉంటుంది".
(దివ్యఖుర్‌ఆన్- అల్ మాయిదా: 48)

ఆయన ఒకే ఒక్క దైవం సమక్షంలో తల వంచాలని, ఆయన అనుగ్రహించిన ధర్మాన్నే అనుసరించాలని మాత్రమే బోధిం చాడు. ఈ ధర్మ మార్గంలో బుద్ధి బలాన్ని ఉపయోగించుకుని తమకంటూ ప్రత్యేక స్థానం కోరుకునేవారికి అలాంటి అవ కాశమే లేదు. వారి పెద్దరికం చెలామణి అయ్యే పథకం లేదు. జనం వారి వెనకా ముందూ గుమిగూడి వారి సమక్షంలో తలలు వంచడమే కాక జేబులు ఖాళీ చేసే ఆస్కారం అసలే లేదు.

ఇలాంటి అత్యాశాపరులే కొంగ్రొత్త నమ్మకాలు, తత్వాలు, సరికొత్త ఆరాధనా రీతులు, మత వ్యవహారాలు, విచిత్ర మయిన జీవన విధానాలూ సృష్టించారు. కొత్త మతభావనలు కల్పించారు. మానవాళిని దైవవిధేయతా రాచబాట నుండి వేరు చేసి చిన్న చిన్న కాలి బాటలు అనేకం కల్పించి మానవుల్ని అనుసరింపజేసి, మానవాళిని ఛిన్నాభిన్నం చేసివేశారు. దీని ఫలితంగానే మతం పేరిట వాదులాటలు, పోరాటాలు, సంఘర్షణలు, మత ఘర్షణలు జరిగాయి, మానవ చరిత్ర అంతా రక్తసిక్తమయి పోయింది అని ఆయన మానవుల్ని హెచ్చరించారు.

ఆయన ప్రకటన

నేను మానవులకు మధ్య నెలకొన్న ఈ వర్గాలు, మఠాలు, భేదభావాలు, తారతమ్యాలు – అన్నింటికీ అతీతంగా నిష్పక్ష పాతంగా న్యాయప్రియతను మాత్రమే ఆశ్రయిస్తాను. నేను ఒక వర్గానికి సానుకూలం గాను మరో వర్గానికి వ్యతిరేకంగా పక్ష పాతంతో వ్యవహరించలేను. నా సంబం ధం సకల మానవులతోనూ సమాన మయినదే. మానవాళితో నా సంబంధం సత్యం, న్యాయం ఆధారంగానే ఏర్పడుతుంది. సత్యం ఎటువైపు ఉంటే నేను దాని పక్షాన నిలబడతాను. సత్యం ఆశ్రయించిన వ్యక్తి పరాయివాడయినా, వ్యతిరేకి అయినా, విరోధి అయినా నేనతని పక్షానే నిలు స్తాను. సత్యవిరుద్ధమయిన మాటకు నేను విరోధిని. ఆ అసత్యవాది నా వాడు, నా సన్నిహితుడు, నా మిత్రుడు, నా బంధువు అయినా నేనతన్ని వ్యతిరేకిస్తాను. నేను అసత్యానికి విరోధిని.

నేను మీకు అందజేస్తున్నది, ప్రతిపాదిస్తున్నది సత్యం. నేను ఈ సత్యాన్ని అందజేయటానికి నియుక్తుణ్ణి. ఇందులో ఎటువంటి వ్యత్యాసాన్ని పాటించను. ఇది అందరికీ సమానంగా వర్తిస్తుంది. ఇందులో తన వారని, పరాయివారని తేడా లేదు. పెద్దవారని, చిన్నవారని, అధము లని, అగ్రులనీ తారతమ్యం లేదు. బీద వారని, ధనవంతులని, పండితులని, పామరులని భేదభావం లేదు. శిష్ట జనులని, అల్ప జనులనీ హెచ్చు తగ్గులు లేవు. వేర్వేరు వర్గాలకు వేర్వేరు హక్కులు లేవు, అందరికీ సమానమయిన హక్కులే వర్తిస్తాయి.

ధర్మమయితే అందరికీ ధర్మమే. అధర్మమయితే అందరికీ అధర్మమే. ఒకరికి పాపమయినది అందరికీ పాపమే. ఒకరికి పుణ్యప్రదమైనది అందరికీ పుణ్య ప్రదమయినదే. నేరం అన్నది ఎవరు చేసినా నేరమే. ఒకరికి ఒక న్యాయం మరొకరికి మరో న్యాయం వర్తించదు. ఈ నిష్పక్షపాత నియమంలో నా స్వంత జనులకు, నా ఆత్మీయులకు, ఆప్తులకు, స్వయంగా నాకూ ఎలాంటి మినహాయింపు లేదు.నేను ప్రపంచంలో న్యాయ సంస్థాపనకు వచ్చాను. అందుకే నియుక్తుణ్ణి. ప్రజల మధ్య ఎటువంటి భేదభావం చూపించ కుండా న్యాయంగా వ్యవహరించడానికి, న్యాయాన్ని స్థాపించడానికి నాపై బాధ్యత మోపబడింది. ప్రజల జీవితాలలో నెలకొన్న అసంఖ్యాకమయిన అసంతుల నాలను రూపు మాపడానికి, అన్యాయాలను అంతమొందించడానికి, సమాజంలో పొడసూపుతున్న అసమానతలను తుడిచి పెట్టడానికి నియోగించబడ్డాను నేను. అంతే కాదు నేను మీ మధ్య న్యాయ మూర్తిగా కూడా వ్యవహరిస్తాను. మీలో తలెత్తే తగాదాలకు సరయిన, న్యాయవంతమయిన తీర్పులను చేయడానికి దైవం నియమించిన న్యాయ నిర్ణేతను నేను అని కూడా ఆయన చాటారు. తదనుగుణంగా మదీనా లో స్థాపించిన తొలి ఇస్లామీయ నగర రాజ్యానికి న్యాయమూర్తి, జడ్జిగా కూడా ఆయన భూమిక అద్భుతమయినది.

న్యాయానికి చిహ్నం “మీజాన్” (తుల మానం, తరాజు, తక్కెడ) అని, నేటికి పదిహేను వందల ఏళ్ళ క్రితం చాటింది, ఎత్తి చూపింది ప్రవక్త మహనీయుల (స) ద్వారా అందిన దివ్యఖురాన్ మాత్రమే అన్నది అఖండనీయ మయిన సత్యం.

> ఆ చీకటి ఎడారిలో విలసింది వెలుగొందే ఒక రోజు. దొని ఘుమఘుమలే నేటికీ జన వనంలో ఆశల తెరలను నింపు తున్నాయి. ఆ పుణ్యరాజమే ముహమ్మద్ (స)! ఆయన ఒక సందేశహరుడు, దైవ సందేశహరుడు, అంతిమ దైవ ప్రవక్త.

“సత్యం, ధర్మంతోపాటు ఈ గ్రంథాన్నీ, (న్యాయ నిర్ణయానికి) తులమానాన్నీ అవతరింపజేసినవాడే అల్లాహ్”.

(దివ్య ఖుర్ఆన్– అష్ షూరా: 17)

(టిఐపి వారి ‘మానవ మహోపకారి ముహమ్మద్ (స)’ పుస్తకం ఆధారంగా)



కువైట్ సామాజిక ఆచార వ్యవహారాలు

కువైటీ సమాజం వంశపారంపర్యంగా వస్తున్న ఆచారాలను పాటించడంతోపాటు, ఇస్లామీయ ఆదేశులను అనుసరించడంలోనూ తనదైన ప్రత్యేకత గల సమాజం. ఇక్కడి పౌరులు ఇస్లామీయ సంప్రదాయాలను ముళ్ళు గొప్పగా అభిమానిస్తారు. వీలైనంత వరకు ఇస్లాం నిర్దేశించిన పరిధుల్లోనే జీవించేందుకు తమ వంతు కృషి చేస్తారు. జీవనోపాధిని వెతుక్కుంటూ వచ్చిన మనం ఇక్కడి ఆచారాలను తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

కుటుంబ ప్రతిష్ట

1– తలుపులు తెరిచి ఉండగా ఇంటి లోపల తొంగి చూడటం, కిటికీల ద్వారా గానీ, గోడపై నుండి గానీ, కప్పుపై నుంచి గానీ ఇంటి లోపలికి తొంగి చూడ టం, అనుమతి లేకూండా ఇంటి లోపలి కి దూరడం వంటివి కువైటీ సమాజంలో అతి చెడ్డ వ్యాపకంగా భావించబడుతుంది.

2– సాధ్యమైనంత వరకు ఇరుగుపొరుగు వారిని ఇబ్బంది పాల్జేయకూడదు అన్న ప్రవక్త (స) వారి ప్రవచనాన్ని బాగా ఆకళింపు చేసుకున్న వారు ఇక్కడి పౌరులు. గొంతు పెంచి మాట్లాడటం గానీ, దారికి అడ్డుగా వాహనాన్ని పెట్టడం గానీ, దారి మధ్య ఏదైనా హానికర వస్తువు ను పడేయటంగానీ, చౌరాస్తాల్లో నిలబడి కబుర్లు చెప్పుకోవడంగానీ వారు చేయరు. ఎవరైనా చేసినా ఊరుకోరు.

3– గృహ యజమానులు ఉన్నప్పుడే ఏ వ్యక్తికయినా ఇంట్లో ప్రవేశించే అనుమతి ఇవ్వబడుతుంది. అది కూడా ఒక నిర్ణీత సమయంలోనే. **“(మూడు వేళలు మీ కోసం ఏకాంత సమయాలు) మీ బానిసలు, ప్రాజ్ఞ వయసుకు చేరుకోని మీ పిల్లలు (పడక గదిలో) మీ వద్దకు రావాలంటే మాత్రం మీ అనుమతి తీసుకోవలసి ఉంటుంది”.** (నూర్: 58) అన్న దైవాజ్ఞ దృష్ట్యా వారు ఇలా చేస్తారన్నది గమనార్హం.

వారం వారం సపరివారి సమేతం

1– “బంధువుల్ని, ఆప్తుల్ని, రోగుల్ని అప్పుడప్పుడు వెళ్ళి పరామర్శిస్తూ ఉండాలన్న” ప్రవక్త (స) వారి ప్రవచనం పాటిస్తూ సమయం సందర్భాన్ని బట్టి ఒండొకరిని సందర్శించుకోవడం, పరామర్శించుకోవడం ఇక్కడి పౌరుల్లోని ముఖ్య లక్షణం. ధార్మిక పండుగల సందర్భాల్లోనైతేనేమీ, జాతీయ వేడుకల సమయాల్లోనైతేనేమీ, వివాహ వేడుకల్లో నైతే నేమీ, ఇతరత్రా సందర్భాల్ని పురస్కరించుకుని సకుటుంబ సపరివార సమేతంగా బంధువుల ఇంటికి వెళ్ళడం ఇక్కడి ప్రజల ఆనవాయితి.

2– సౌకర్యార్థం కువైటీ కుటుంబాలు వేర్వేరుగా నివసిస్తున్నప్పటికీ **“బంధుత్వ సంబంధాలను పటిష్ట పర్చండి”** అన్న ప్రవక్త (స) వారి మాటకు కట్టుబడి వారం వారం, నెలనెలా పరస్పరం రాకపోకలతో తమ మధ్య గల బంధుత్వ సంబంధాన్ని వారు మరింత బలోపేతం చేసుకుంటారు.

3– కువైటీ కుటుంబానికి చెందిన స్త్రీగానీ, పురుషుడుగానీ తల్లిదండ్రులను, అన్నా చెల్లెళ్లను సందర్శించేందకు వెళ్ళినప్పుడు తనతోపాటు తన సంతానాన్ని సయితం తీసుకువెళ్ళడాన్ని ఇష్టపడతారు.

పొందికైన దుస్తులు

“అన్నజాఫతు నిస్ఫుల్ ఈమాన్” – శుచీశుభ్రతలు విశ్వాసంలోని సగ భాగం” అన్న ప్రవక్త (స) వారి మాటను గౌరవిస్తూ కువైటీలు దుస్తుల్ని, దేహాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రత్యేక శ్రద్ధనే కనబరుస్తారు. ప్రపంచమంతా ఓ కుగ్రామంగా మారి పోయిన నేటి ఈ ఆధునిక యుగంలో సయితం కువైటీ స్త్రీలు సంప్రదాయ బద్ధమైన నిండు దుస్తులు ధరించడాన్నే ఇష్ట పడతారు. **‘ఒక జాతి గురించి అంచనా వేయాలంటే ఆ జాతి స్త్రీని చూడాలి. ఒక స్త్రీని గురించి అంచనా వేయాలంటే ఆమె ధరించే దుస్తుల్ని చూడాలి’** అన్న మాటను వీరు వస్మరించరు. **“స్త్రీ దేహం మొత్తం పరదాయే, ముఖం చేతులు తప్ప”** అన్న ధార్మిక పండితుల అభిప్రాయానికను గుణంగా ఇక్కడి స్త్రీలు పూర్తి శరీరాన్ని కప్పే అబా, హిజాబ్, నఖాబ్ వంటి దుస్తుల్ని మాత్రమే తొడుగుతారు. ఇక పురుషుల విషయానికొస్తే అధికశాతం మంది **‘దిష్దాషా’** అనే తేలికైన జుబ్బా వంటి వస్త్రాన్ని తొడుగుతారు. అలాగే తలపై **‘గత్రా’**, దానిపై నల్లటి **‘ఉఖాల్’** కూడా ధరిస్తారు.

సయ్యద్ అబ్దుస్సలాం ఉప్పీ
abdussalamsyed@ymail.com

ఆయన ﷺ మాట బంగారు బాట

నేడు మానవ సమాజాన్ని పట్టి పల్లారుస్తున్న వర్ణ విశిష్ఠతలు, వంశ డాంబికాలు, వర్గ వైషమ్యాలు, మత కలహాలు, మూఢ గొడవలు, మఠాల రాసలీలలు, భేదభావాలు, తారతమ్యాలు అస్పృశ్యతలు, అసమానతలు – అన్నింటికీ కారణం మనిషి మాధవుని దాస్యాన్ని విస్మరించి, తోటి మనిషికి ఊడిగం చేయడం ఒకటైతే, మతం పేరుతో కుమతులు కొందరు కుయుక్తులు పన్నుతూ తమకంటూ ఓ ప్రత్యేక స్థానం కావాలని, తమ పెత్తనమే చెల్లాలని, జనం తమ వెనుకా ముందు గుమిగూడి గ్రుడ్డిగా తమ సమక్షంలో శరీర శిఖరమైన శిరస్సుని వంచడమే కాక, ఉన్న అర్ధాణ, చారాన కూడా సమర్పించు కోవాలని కోరుకోవడం కూడా ఒక ప్రధాన కారణమే. 'సకల మానవులు సమానులే' అని స్లోగన్ వల్లిస్తూనే, తన వర్గానికి సాను కూలంగానూ, మరో వర్గానికి ప్రతికూలంగానూ పక్షపాతంతో వ్యవ హరిస్తూ, ప్రజలకు స్లో పాయిజన్ ఇస్తూ, కడకు కడతేర్చేంతటి నీచ స్థాయికి దిగజారుతూ, అంగస్సు కోసం అంగలార్చే అలగా జనులైన వీరు ప్రజల్ని ముగ్దుల్ని చేసే మాయాజాలాలు, జిమ్మిక్కులు బాగానే ప్రదర్శిస్తారు.

ఇలాంటి పేరాశపరుల వల్లనే కొత్త పుంతలు, వెకిలి చేష్టలు, వింత జీవన విధానాలు వెర్రి తలలు వేస్తున్నాయి. ఈ నయవంచకుల మాయలో పడి మానవాళి ధర్మమనే రాచబాట నుండి వేరయి పెడ త్రోవలు త్రొక్కడమే కాక, మానవతకే తలమానికం వంటి 'తౌహీద్' (ఏకేశ్వరోపాసన) పవిత్ర భావానికి తలకొరివి పెట్టేందుకు సయితం సిద్ధమవడం కడు శోచనీయం! వారి ఈ వైఖరి మిక్కిలి విచారకరం!! ఫలితం – వాదులాటలు, పోరాటాలు, ఘర్షణలు, మత సంఘర్షణలు, మారణ హోమాలతో అవనీతలమంతా అతలాకుతలమైపోయింది. ఇలాంటి విపత్కర పరిస్థితిలో ధర్మ ప్రచార కార్యం అత్యంత కష్ట భూయిష్ఠమైనదే. కానీ, నిరంతర శ్రమ, అవిరళ కృషి, అహరహ ప్రయత్నం ఖచ్చితమైన ప్రత్యామ్నాయం కాగలదన్నది నిర్వివాదాంశం. అందుగ్గాను –

అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారి జీవితాన్ని, ఆయన బోధనల్ని అధ్యయనం చేయటం, ఔపోసన పట్టడం మానవతా పరిణతికీ, అభ్యున్నతికీ అవసరమైన అంశం. ఈ అధ్యయనం కేవలం ఉద్యమంతో ఆగిపోకూడదు. అది వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ, స్వర్గ సాఫల్య, నరక విమోచన పథక రూపకల్పన వరకు కొనసాగ వలసిన మహా ప్రస్థానం.

మానవ మహోపకారి ముహమ్మద్ (స) నైతికతను దాని ఉత్తమోత్తమ ప్రమాణానికి చేర్చడానికి అరుదెంచిన అంతిమ దైవ ప్రవక్త. ఆయన (స) సత్యోపదేశం ఎంతో మనోజ్ఞంగా, మనోహరంగా, కర్ణపేయంగా అంతర్యంలోకి చొచ్చుకుపోయేది. మనిషిలో సత్య ప్రియత లేశమంత ఉన్నా, అజ్ఞానం అపమార్గాల ఆకర్షణ అతన్ని లోబరచుకోకపోతే, అతని మనోకాంక్షలకు పూర్తిగా బానిసయిపోయిన వ్యక్తి కాకపోతే ఆయన (స) సత్యోపదేశంలోని సత్యత అతన్ని ప్రభావితం చేయక మానదు.

సదా సత్యం, సౌశీల్యంతో జీవితం గడపాలనీ, బంధువులు, రక్త సంబంధీకుల యెడల ఉత్తమ రీతిలో ప్రవర్తించాలన్నది ఆయన అన్న బంగారు మాట. 'సచ్ఛీలత, సౌజన్యత, సుశీలత, సదాచారం, సత్ప్రవర్తన కలిగి ఉండాలి. తోటి మానవులకు హాని కలిగించే, స్వయానికి నష్టాన్ని చేకూర్చే ఏ మాటా, ఏ చేష్ట (లా జరర వలా జిరార్)కూ పాల్పడరాదు. తోటి సోదరునితో మంచిగా ప్రవర్తించాల' న్నది ఆయన (స) తన అనుయాయుల్లో నూరిపోసిన అపురూప భావన. 'భువన గగనాల సృష్టికర్త, స్వామి, ప్రభువు అల్లాహ్ ఒక్కడే. అలాంటప్పుడు మనిషి ఆయన ఎదుటే మోకరిల్లాలి. ఆయన పట్లనే అందరికన్నా అధికంగా ప్రేమభావం కలిగి ఉండాలి. ఆయనకే విధే యుడై మెలగాలి. సర్వకాల, సర్వావస్థల్లో ఆయన అండ దండలనే అర్థించాలి. మనుషులంతా ఆదం సంతానమే. మరి ఆదం మట్టితో సృజించబడ్డాడు' అన్న అమృత వాక్కు ఆయన (స) నోట జాలు వారినదే. 'అన్నింటిలోనూ ప్రధానాంశం ఏకేశ్వరోపాసన. ఆ భావన కు అనివార్య పరిణామమే మానవత్వపు భావన, సృష్టికర్త అయిన అల్లాహ్‌ను ప్రేమించే మనిషి ఆ సృజనకారుడిచే ఉనికిలోకి తేబడ్డ మానవుల్ని, సకల ప్రాణుల్ని సయితం ప్రేమించి తీరాలి. (రహ్మత న్నాసి, రహ్మతన్ ఆమ్మతి) అన్న ఈ భావనే విశ్వ మానవ సోదరత్వా నికి పునాది వంటిది' అన్న పసిడి పలుకులతో సకల సమస్యలకు సవ్యమైన పరిష్కారం చూపింది ఆయనే.

ఇస్లాం ధర్మానికి మూలం, కేంద్ర బిందువు, సకల సంస్కరణలకు ఆధారం తౌహీద్, రిసాలత్, ఆఖిరత్. ఈ మూడింటినీ విశ్వసించడం తోపాటు అల్లాహ్ తరఫున అరుదెంచిన అంతిమ మార్గదర్శకత్వ గ్రంథం ఖుర్‌ఆన్‌ను పాటించాలి అని ఉద్ఘాటించారాయన (స). ప్రజలు అభిలషించినట్లయితే వారిని మానవ దాస్యం నుండి విముక్తి కలిగించి దైవ దాస్యంలో ప్రవేశింపజెయ్యడానికి అల్లాహ్ నన్ను నియ మించాడు. మానవుల్ని విభిన్న సంకుచిత భావాల ఇరుక లోయల్లో నుండి వెలికి తీసి విశాల భావాల సువిశాల సాత్విక క్షేత్రాల్లో చేర్చ మని, దౌర్జన్యపరమయిన వ్యవస్థల బారి నుండి రక్షించి దైవ విధే యతా, శాంతి మార్గమయిన ఇస్లాం సూచించే న్యాయం, సమాన త్వాల వ్యవస్థ ఛత్రచాయల్లో ఆశ్రయం కల్పించమని నన్ను ఆదేశిం చాడు' అంటూ తన సందేశ లక్ష్యాన్ని వివరించిందీ ఆయనే (స).

ఇదే మహనీయ ముహమ్మద్ (స) వారి సందేశం. స్వయంగా తన జీవితంలో ఈ సందేశానికి కట్టుబడిన ఆయన (స) ఈ సందేశాన్ని స్వీకరించిన వారిని సంస్కరించి, వారి వ్యక్తిగత జీవితాలను ప్రక్షాళనం చేసి, వాటికి మెరుగులుదిద్ది ఉత్తమ మానవులుగా రూపొందించారు. వారి ద్వారా ఏర్పడిన సమాజాన్ని ఆదర్శ, సత్సమా జంగా మలిచారు. రండీ! మనమూ ఆ శిక్షణా తరగతుల్లో పాల్గొని, ప్రవక్త (స) వారి ఆదర్శాల్ని మన వ్యక్తిత్వాల్లో నింపుకుని, ఆయన ప్రతిపాదించి వెళ్ళిన సూచన ఆధారంగా మనల్ని మనం సంస్కరిం చుకొని అలనాటి ఆదర్శ సత్సమాజాన్ని సాధించే దిశగా అడుగులు వేద్దాం!!

మూలం:
మౌలానా గియాస్ అహ్మద్ రషాదీ

అనువాదం:
అఫ్రోజ్ అహ్మద్

ఈ విశ్వ వ్యవస్థ వెనుక ఉన్నది ఎవరు?

ఆ కాశంలో ఎరిగే విమానాన్ని చూసిన వ్యక్తి ఆ విమానంలో దానిని నడిపే వ్యక్తి తప్పనిసరిగా ఉంటాడని అంచనా వేస్తాడు. రివ్వున దూసుకుపోయే రైలుని చూసిన వ్యక్తి ఆ రైలులో తప్పనిసరిగా డ్రైవర్ ఉండి ఉంటాడని లేదా ఆ రైలుని కంప్యూటర్ ద్వారా కంట్రోల్ చేసే టెక్నిషన్ ఉండి ఉంటాడని ఊహిస్తాడు. రాత్రి చీకటిలో నిద్రిస్తున్న వ్యక్తి బయటి నుంచు 'భౌ, భౌ' అనే శబ్దం విని, ఎవరో అపరిచిత వ్యక్తిని, వస్తువు చూసి కుక్క అరుస్తున్నది అని అర్థం చేసుకుంటాడు. విమానం పైలెట్ లేకుండా ఎగరలే నప్పుడు, రైలు డ్రైవర్ లేకుండా కదల నప్పుడు, ఇంత పెద్ద సూర్యుడు తనం తట తానే ఉదయిస్తున్నాడా? లేదా సూర్యుడ్ని ఉదయింపజేసేవాడు, అస్త మింపజేసే వాడు ఒకడున్నాడా? పైనున్న ఆకాశం ఎటువంటి స్తంభం లేకుండా ఎలా నిలబడింది? దాన్ని పట్టి ఉంచిన వాడు ఎవరు? ఈ భూమి కదిలిపో కుండా అందులో పర్వతాల్ని మేకులుగా నాటిందెవరు? రేయింబవళ్ళ చక్రభ్రమ ణానికి కారకుడు ఎవరు? గాలుల్ని ఒక చోట నుండి మరో చోటుకు తీసుకెళు తున్నదెవరు? వాన కురిపిస్తున్నదెవరు? గింజ మొలకెత్తిస్తున్నదెవరు? ఆ గింజ నుండి మహా వృక్ష సృజనకు తోడ్పడు తున్నదెవరు? మనల్ని, మన తాత ముత్తాల్ని పుట్టించిందెవరు? ఇవన్నీ వాటంతట అవే ఉనికిలోకి వచ్చే శాయా? వీటన్నింటికీ ఉనికి ఇచ్చిన శృజకారుడెవడైనా ఉన్నాడా?

హజ్రత్ అబూ హనీఫా (ర.అ) కాలం నాటి మాట. ఓ వ్యక్తి భూమ్యాకాశాలు తనంతట అవే నడపబడుతున్నాయని, వీటి వెనుక ఏ శక్తి ప్రమేయమూ లేదని, రాత్రింబవళ్ళు వాటంతట అవే వస్తూ పోతుంటాయని, వీటి వెనుక ఏ ఒక్కరి హస్తమూ ఉండదని నమ్మ బలుకుతూ ప్రజల్ని ప్రక్కతోవ పట్టించ ప్రయత్నిస్తున్నాడు. అది తెలిసిన ఇమామ్ అబూ హనీఫా(రహ్మ) **"సరైన సమాధానం తనవద్ద ఉందని, ప్రజలందరి సమక్షంలో దాన్ని తెలియజెస్తాన"**ని కబురంపారు. అందుకు సిద్ధమయిన ఆ వ్యక్తి నిర్ధారిత స్థలానికి సమయానికి చేరుకున్నాడు. కానీ ఇమామ్ అబూ హనీఫా (ర.అ) గారు మాత్రం కాసింత అలస్యంగా వచ్చారు. ఆ వ్యక్తి ఇమామ్ గారు సమయానికి రాక పోవడాన్ని విమర్శించాడు, కారణం ఏమిటని నిలదీశాడు.

ఇమామ్ గారు తన అలస్యానికి గల కారణాన్ని తెలియజేస్తూ, నేనయితే సరైన సమయానికే ఇంటి నుండి బయలుదేరాను. కానీ దారిలో నది ఉండటం మూలంగా దాన్ని దాటడం కష్టసాధ్యమయింది. అకస్మా త్తుగా నా దృష్టి ఒడ్డున ఉన్న ఓ చెట్టు మీద పడింది. అది తనంతట తాను కోయబడి ఒక చిన్న పడవగా మారిపోయింది. ఆ తరు వాత ఆ పడవ వచ్చి నా ముందు నిల బడింది. ఆ పడవ ఎక్కి వచ్చే సరికి ఇంత ఆలస్యం అయింది" అన్నారు. ఇమామ్ గారి ఈ మాటను విన్న ఆ వ్యక్తి పెద్దగా నవ్వేసి: 'ప్రజలారా! ఈ పండితుడు ఎలాంటి సత్య విరుద్ధమయిన మాట పలుకుతున్నాడో చూశారా? ఏ ఒక్క బుద్ధిజీవి అయినా ఇలాంటి నిర్హేతుక మాటలను నమ్ముతాడా? చెప్పండి' అంటూ బిగ్గరగా అరిచాడు.

అప్పుడు ఇమామ్ గారు కలుగజేసు కుని: **"చూడు నాయనా! నీ ప్రశ్నకు నా సమాధానం ఇదే. ఒక సాధారణమైన చెట్టు తనంతట తాను కోయబడి పడవ గా తయారు కాలేనప్పుడు, తనంతట తాను నడవలేనప్పుడు, మరి అండ, పిండ, బ్రహ్మాండాలతో కూడిన ఈ విశ్వ వ్యవస్థ తనంతట తానే ఉనికిలోకి వచ్చేసింది అన్నది ఎంతవరకు సహే తుకం?"** అని ఎదురు ప్రశ్న వేశారు. దెబ్బకు దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అయింది.కాసేపు తర్వాత తేరుకుని బుద్ధి తెచ్చుకున్నాడా వ్యక్తి.

ప్రియాతిప్రియమైన సోదరులారా! ఇమామ్ గారి ఈ జవాబు కేవలం ఆ వ్యక్తి కోసమే ఉద్దేశించబడలేదు. అన్ని కాలాల్లో నివసించే బుద్ధిజీవుల కోసం ఈ సంఘటన ఓ కనివిప్పు.

సృష్టిలో గల ప్రతి వస్తువు తన ఉనికి ద్వారా మనకిస్తున్న సందేశం ఏమిటంటే, "ఓ బుద్ధిజీవుల్లారా! నేను స్వయంగా ఉద్భవించలేదు. నా సృష్టికర్త ఒకడు న్నాడు. నిన్ను సృష్టించిన ప్రభువే నన్ను కూడా సృష్టించాడు. ఆయనే నాలో జీవం పోసినవాడు, నన్ను సంరక్షిస్తున్నవాడు. ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

"భూమ్యాకాశాలు దొర్లిపోకుండా స్థిరంగా పట్టి ఉంచినవాడు నిస్సందే హంగా అల్లాహ్‌యే. (వారిని అడిగు) ఒకవేళ అవి దొర్లిపడితే అల్లాహ్ తప్ప వాటిని పొదివి పట్టుకునే వారెవరు? నిశ్చయంగా అల్లాహ్ ఎంతో ఉదార స్వభావుడు, గొప్ప క్షమాశీలి".

(ఫాతిర్: 41)

అబ్దుల్ మతీన్ ఉమ్రీ

ముస్లిం ధార్మిక విశ్వాసం

ప్రశ్న: మృతులు పిలుపును వింటాయా?
జవాబు: మృతులు పిలుపును వినలేరు.
ఖుర్‌ఆన్: **నిశ్చయంగా నీవు మృతులను వినిపించలేవు.**
(అన్ నమ్ల్: 80)
హదీసు: నిశ్చయంగా అల్లాహ్ తరఫున తిరుగాడే దైవదూతలున్నారు. వారు నా అనుచర సమాజం పంపే సలామును నా వద్దకు చేరవేస్తారు. (అహ్మద్)

ప్రశ్న: మృతులను సహాయం కొరకు ప్రార్థించవచ్చా?
జవాబు: మృతులను సహాయం కొరకు ప్రార్థించకూడదు, అల్లాహ్‌ను ప్రార్థించాలి.
ఖుర్‌ఆన్: **మీరు మీ ప్రభువును సహాయం కొరకు ప్రార్థించిన సందర్భాన్ని కూడా జ్ఞాపకం తెచ్చుకోండి. ఆయన మీ ప్రార్థనను స్వీకరించాడు.** (అల్ అన్‌ఫాల్: 9)
హదీసు: ప్రవక్త (స) తనకు ఏదైనా బాధ కలిగినప్పుడు ఇలా పలికేవారు: యా హయ్యు యా ఖయ్యూము బిరహ్మతిక అస్తగీసు' (ఓ సజీవుడా! విశ్వ వ్యవస్థను నెలకొల్పి సృష్టి క్రమాన్ని నిర్వహించే వాడా! నేను నీ కారుణ్యం ద్వారా సహాయం కోరుతున్నాను).

ప్రశ్న: అల్లాహ్ తప్ప ఇతరుల సహాయం కోరడం ధర్మసమ్మత మేనా?
జవాబు: ధర్మసమ్మతం కాదు, అల్లాహ్‌ను మాత్రమే సహాయం కొరకు అర్థించాలి.
ఖుర్‌ఆన్: **"మేము నిన్నే ఆరాధిస్తాము. సహాయం కొరకు నిన్నే అర్థిస్తాము".** (అల్ ఫాతిహా:5)
హదీసు: మీరు వేడుకుంటే అల్లాహ్‌నే వేడుకోండి. సహాయం కోసం అర్థిస్తే, అల్లాహ్‌ను మాత్రమే సహాయం కోసం అర్థించండి.
(తిర్మిజీ)

ప్రశ్న: భూమికి ఉన్న సృష్టి సహాయం కోరవచ్చా?
జవాబు: అవును, కోరవచ్చు. వేటి సహాయం అయితే వారు చేయగలుగుతారో, వాటి సహాయం వారి నుంచి తీసుకోవచ్చు.
ఖుర్‌ఆన్: **"మంచికి, దైవభీతికి సంబంధించిన పనులలో అందరితోనూ సహకరించండి. పాపకార్యాలలో, అత్యాచారాలలో ఎవరితోనూ సహకరించకండి".** (అల్ మాయిదా: 2)
హదీసు: దాసుడు తన సోదరుని సహాయంలో ఉన్నంతవరకు అల్లాహ్ దాసుని సహాయంలో ఉంటాడు. (ముస్లిం)

అజీజుర్రహ్మాన్

కలిసి నిలబడండి మీ హృదయాలు కలుస్తాయి

ఏ జాతి జీవన ప్రవాహమైనా సామూహిక క్రమశిక్షణ లేకుండా చల్లగా, సజావుగా సాగదు. క్రమశిక్షణా రాహిత్యం, అస్తవ్యస్తత గనక పొడసూపితే ఇక ఆ జాతి జీవనంలో స్తబ్ధత ఆవరిస్తుంది. దాని బ్రతుకంతా చిందరవందర అయిపోతుంది.

అందుకే ఇస్లాం తన అనుచర సమాజంలో క్రమశిక్షణ చెదరిపోకుండా ఉండటానికి 'సామూహిక నమాజ్' అనే క్రియాత్మక దృష్టాంతాన్ని నెలకొల్పింది. ఇస్లాం ప్రవక్త (స) ఈ దృష్టాంతం ఆధారంగానే చెల్లాచెదురుగా పడి ఉన్న అరబ్బు జాతిని ఓ కట్టుదిట్టమైన జీవన విధాన మూసలో పోశారు. వారిని ఒకే త్రాటిపై నడిపించారు. ఐకమత్యం కోసం, సద్భావన కోసం, ఒకే మాటపై నిలిచి,ఒకే బాటపై నడవటం కోసం 'సామూహిక నమాజు'ను నెలకొల్పటం ఎంత అవసరమో ఉదాహరణప్రాయంగా రూఢీ చేశారు.

సామూహిక నమాజులో ముస్లింలు వరుసలు తీరి భుజానికి భుజం ఆనించి నిలబటం, ఒకే నాయకు(ఇమామ్)ద్ని అందరూ సమానంగా అనుసరించటం అపురూప విషయం. ఒక జాతి జీవనాన్ని ఒకే సమాహారంలో బంధించే విలక్షణ వ్యవస్థ ఇది. సీసం కరిగించి పోయబడిన గోడ పటిష్టంగా ఉన్నట్లే సామూహిక నమాజు వ్యవస్థలో ఇమిడిపోయిన జాతి జీవనం కూడా పటిష్టంగా, చెక్కు చెదరకుండా ఉంటుంది.

అయితే –

సామూహిక నమాజు చేస్తున్నప్పుడు ఆ నమాజీలలో నిజమైన భక్తి, అణుకువ ఉండాలి. అరమరికలు దూరమవాలి. కల్లాకపటం నిష్క్రమించాలి. దైవ సహాయం కోసం దీనాతిదీనంగా వారి పెదవులు ప్రార్థించాలి. అప్పుడే జాతీయ జీవనంలో పరస్పర సహకార భావం జనిస్తుంది. సంఘీభావం వెల్లి విరుస్తుంది. సాటి సోదరుల పట్ల నిజమైన సానుభూతి పెంపొందుతుంది.

అందుకే –

అంతిమ దైవ ప్రవక్త (స) వారు సామూహిక నమాజు సందర్భంగా పంక్తులు సరిదిద్దే విషయానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు.

"మీరు కలిసి కట్టుగా నిలబడనంత వరకూ మీ హృదయాలు కూడా పరస్పరం కలవలేవు" అని ఆ మహనీయుడు (స) నొక్కి వక్కాణించారు. (సహీహ్ బుఖారీ – కితాబుస్సలాత్)

మహోదయం

మహోదయం ఆయన పుట్టిన సమయం
అహో! మహోజ్వల శుభాశయం
నూకలు చెల్లాయి నియంతృత్వానికి
నిప్పులు చెరిగాయి నిజం నేత్రాలు

సత్యానికి అసత్యానికి నడుమ గల
సరిహద్దులు చెరిగిపోయిన ఆ సమాజం
ప్రతిమల్ని ప్రభువుతో అభివర్ణించగల
ప్రజలు పరిపాలిస్తున్న ఆ సమాజం
మూఢత్వం, అంధకారం, పశుత్వం పెరిగి
సహజత్వం, మానవత్వం, ప్రేమతత్వం తరిగి
దానవత్వం సర్వత్రా తీండ్రిస్తూ
రంకెలు వేస్తున్న ఆ సమాజంలో
నిజతత్వం, నిర్భయత్వం వెనుకంజ వేస్తున్న ఆ రోజుల్లో
సత్యం ఇదని చెప్పడం అంటే సింహ కేశాలు తేవడం
వంటిదే!

అయినా–
ఒక మనిషి ఒకే ఒక మనీషి
ముసురుకునే మూఢ విశ్వాసాల మీద
అలుముకునే అంధ ఆచారాల మీద
ముసుగులు తొలగించాడు
తానొక్కడే ఒక ధర్మ తేజం
తానే ఒక విశ్వ విద్యాలయం
తానే ఒక విజ్ఞాన నిధి నిక్షేపం
అతని సుచరిత్ర అలనాటి
అన్యాయాల మీద అలుపెరగని పోరాటం
అతని మాటలు ముత్యాల మూటలు
అతని ఉపదేశాలు అవలీలగా
అబద్ధాలను బైట పెట్టే అద్దాలు

అతనారాధించే దైవం ఒక్కడే
నువ్వూ–నేనూ, అతడూ–ఆమె
అదీ–ఇది అన్నింటి సృష్టికర్త
జనం మాట్లాడే అన్ని భాషలు
ఆయన ప్రసాదించిన దివ్య వరాలే
అందరి మొరలను ఏక సమయంలో
ఆలకిస్తాడు, అనుగ్రహిస్తాడు.

మన కష్ట సుఖాలు చెప్పుకోవడానికి
ఇంతకన్నా మంచి దేవుడు ఎక్కడున్నాడు?
ఇంతకీ ఆ మాధవుడెవడు?
ఆ మానవుడు ఎవరంటారా?!

అందరి ఆరాధ్యుడైన అల్లాహ్‌యే ఆ మాధవుడు
అందరికి ఆదర్శమైన ఆ మానవుడే అంతిమ
దైవ ప్రవక్త ముహమ్మద్ (స)

ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలనుంది

– అబుల్ హసన్

ప్రవక్తా! విశ్వనాయకా!!
అందుకోండి నా అశ్రువులు నిండిన నీరాజనాలు

ఎక్కడ అంధకారం నిండి ఉంటుందో
అక్కడ మీ జ్ఞాన విజ్ఞాన జ్యోతుల్ని వెలిగించాలనుంది
ఎక్కడ మానవత్వం మసకబారుతుందో
అక్కడ మీ అమృత వాక్కులు విన్పించాలనుంది
"ప్రవక్తా..."

ఎక్కడ మనసులు మూగబోతాయో
అక్కడ మీ తేనె పలుకులు పలికించాలనుంది
ఎక్కడ జనులు– జనంలోంచి వనంలోకి వెళతారో
అక్కడ మీ వాక్యాల వసంతాలు పూయించాలనుంది
"ప్రవక్తా..."

ఎక్కడ మారణహోమం రగులుతుందో
అక్కడ మీ మమతల మల్లెలు చల్లాలనుంది
ఎక్కడ ప్రజలు అణచివేయబడతారో
అక్కడ మీ న్యాయాన్ని స్థాపించాలనుంది
"ప్రవక్తా..."

ఎక్కడ అనాథలు అశ్రద్ధ చేయబడతారో
అక్కడ మీ ఆదర్శాలు బోధించాలనుంది
ఎక్కడ వితంతువుల్ని వింతగా చూస్తారో
అక్కడ మీ మహితోక్తుల విత్తులు నాటాలనుంది
"ప్రవక్తా..."

ఎక్కడ సత్యం పత్యమైపోయిందో
అక్కడ మీ సత్యసంధతను చాటాలనుంది
ఎక్కడ అసత్యం నిత్యమైపోయిందో
అక్కడ మీ సత్యకాంతుల్ని వెదజల్లాలనుంది
"ప్రవక్తా..."

ఓ ప్రవక్త ప్రభువా! ప్రాధేయపడుతున్నాను
మన్నించవా నా ఈ విన్నపాన్ని
ధనం, బలం, కాదు, గుణం ముఖ్యమని
తెలిసి వచ్చేలా తెలివి వచ్చేలా చెయ్యి లోకానికి

ఖుర్‌ఆన్ వెలుగులో యేసు (ఈసా)

عليه السلام



దోష సవరణ

జనవరి సంచికలో ఇదే వ్యాసం – 9వ పేజీ మొదటి పంక్తిలో **ఆ అధికారి యేసు క్రీస్తును సురక్షితంగా ఆకాశం పైకి ఎత్తుకున్నాడు** అని తప్పు దొర్లింది. నిజానికి అది ఇలా ఉండాలి:

ఆ అధికారి యేసుక్రీస్తుకి శిలువ వేయమని ఆదేశించాడు. కాని దేవుడు యేసుక్రీస్తును సురక్షితంగా ఆకాశంపైకి ఎత్తుకున్నాడు.

జరిగిన పొరపాటుకు క్షంతవ్యులం. పొరపాటును ఎత్తి చూపిన శ్రేయోభిలాషులందరికీ కృతజ్ఞతలు. – ఎడిటర్

తీర్పు దినాన యేసు క్రీస్తు సంజాయిషీ

"మర్యమ్ పుత్రుడవైన ఓ ఈసా! అల్లాహ్‌ను వదలి 'నన్నూ, నా తల్లిని' ఆరాధ్య దైవాలుగా చేసుకోండి అని నీవు జనులకు చెప్పితివా?" అని అల్లాహ్ నిలదీసి అడిగే సందర్భం కూడా స్మరించ దగినదే. అప్పుడు ఈసా ఇలా విన్న వించుకుంటారు: **"(ఓ అల్లాహ్!) నిన్ను పరమ పవిత్రునిగా భావిస్తున్నాను. ఏ మాటను అనే హక్కు నాకు లేదో దానిని అనటం నాకే మాత్రం తగదు. ఒకవేళ నేను గనక అలాంటిదేదైనా అనివుంటే అది నీకు తెలిసి ఉండేది. నా మనసు లో ఏముందో కూడా నీకు తెలుసు. కాని నీలో ఏముందో నాకు తెలీదు. నిశ్చ యంగా నీవు సమస్త విషయాలను తెలి సినవాడవు".** (5:116)

1) తీర్పు దినాన ఎదురయ్యే ప్రశ్నోత్త రాల రసవత్తర సన్నివేశమిది. నిజ దైవాన్ని కాదని ఇతరత్రా వస్తువులను, పుణ్య పురుషులను, ప్రవక్తలను పూజించే వారికి ఇదొక అల్టిమేటం. వీళ్లు ఆరా ధించే ఆ మహనీయులంతా ఆనాడు మానవాళి సమక్షంలో నిలదీయబడ తారు. నిప్పులాంటి నిజం ఆనాడు అంద రికీ తెలిసి వస్తుంది.

2) క్రైస్తవులలోని ఒక తెగ ఏసు క్రీస్తుతో పాటు, ఆయన తల్లి అయిన మర్యమ్‌ను కూడా దైవంగా చేసుకున్నారు.

3) తన వద్ద అగోచర జ్ఞానం లేదని మర్యమ్ కుమారుడైన ఈసా (అ) స్పష్టంగా చెప్పేసారు. ఒకరి మార్గదర్శ కత్వం లేకుండా ఆది నుండి అంతం వరకూ సమస్త విషయాలు తెలిసివున్న వాడే 'రహస్య విషయాల జ్ఞాని' అనబడ తాడు. ఈ రకమైన జ్ఞానం అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ లేదు.

ప్రళయ సూచనగా యేసు ఆగమనం

ప్రళయ దినానికి సమీపంలో యేసు (ఈసా–అ) దివి నుండి భువికి దిగి వస్తారని ఖుర్‌ఆన్ చెబుతోంది. ప్రామా ణిక హదీసుల ద్వారా కూడా ఈ విష యం రూఢీ అవుతోంది. ఉదాహరణకు ఈ వచనం చూడండి:

"నిశ్చయంగా అతను (ఈసా అ) ప్రళ యానికి ఒక సూచన. కాబట్టి మీరు ప్రళయం విషయంలో సందేహ పడ కండి. మీరు నన్ను అనుసరించండి. ఇదే సరైన మార్గం". (జుఖ్‌రుఫ్: 61)

ఈ క్రింది వచనాన్ని కూడా గమనిం చండి:

"గ్రంథవహులలో ఏ ఒక్కడూ ఈసాను, అతని (అంటే తన మరణానికి లేదా ఆయన) మరణానికి ముందు విశ్వ సించకుండా మిగలడు. ప్రళయ దినాన ఆయన వారిపై సాక్షిగా ఉంటాడు".

(అన్ నిసా: 159)

ఈ సూక్తికి అత్యధిక మంది అత్యుత్తమ శ్రేణి వ్యాఖ్యాతలు చేసిన వ్యాఖ్యానం ప్రకారం యేసు క్రీస్తు (ఈసా – అ) మరోసారి భువిపైకి దిగి వచ్చి, దజ్జాల్ అనే కల్లోల జనకుణ్ణి వధిస్తారు. అప్పుడు సర్వత్రా దైవధర్మ మైన ఇస్లాం వ్యాపిస్తుంది. ఆఖరికి యేసుక్రీస్తు దైవ ధర్మాన్ని తృణీకరించిన గ్రంథవహులను సయితం వదలిపెట్టరు. ఈ విధంగా లోకంలో ఉన్న గ్రంథవహులంతా యేసు క్రీస్తు మరణించక ముందే అల్లాహ్ జీవన విధానాన్ని ఆశ్రయించి తనువు చాలిస్తారు. ఇక వారి విశ్వాసం (ఈమాన్) ఏ స్థాయికి చెందినదైనా – వారు విశ్వసించటమనేది మాత్రం తథ్యం. సహీహ్ హదీసులు కూడా ఈ విషయాన్నే చాటి చెబుతున్నాయి.

ఉదాహరణకు మహనీయ ముహమ్మద్ (స) ఒక సందర్భంగా ఇలా వక్కాణిం చారు:

"ఎవరి అధీనంలో నా ప్రాణ ముందో ఆ శక్తిమంతుని సాక్షి! మర్యమ్ కుమా రుడు అధికారిగా, న్యాయశీలునిగా మీ మధ్యన ఏతెంచే సమయం తప్పక వస్తుంది. ఆయన శిలువను విరగ్గొడ తారు. పందిని వధిస్తారు. జిజ్‌యాను ఎత్తి వేస్తారు. ధనం ప్రజలు పుచ్చుకో లేనంత పుష్కలంగా ఉంటుంది. ఒక్క సజ్దా (సాష్టాంగ ప్రణామం) ప్రపంచం మరియు అందులో ఉన్న సంపత్తికన్నా శ్రేష్ఠమైనదై పోతుంది".

(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)

ఆ విషయాన్నే దివ్యఖుర్ ఆన్ ఈ విధంగా చిత్రీకరించింది: "ప్రవక్త (ముహమ్మద్ –స)పై అవతరించిన దానిని వారు విన్నప్పుడు, సత్యాన్ని గ్రహించిన కార ణంగా వారి కళ్ళ నుంచి కన్నీరు ప్రవ హించటం నీవు గమనిస్తావు. వారిలా అంటారు: 'మా ప్రభూ! మేము విశ్వసిం చాము. కాబట్టి మా పేర్లను కూడా ధృవీకరించే వారిలో వ్రాసుకో. మేము అల్లాహ్‌ను,మా వద్దకు వచ్చిన సత్యాన్ని విశ్వసించకుండా ఉండటానికి ఇక మా వద్ద మిగిలిన సాకు ఏముంది? మా ప్రభువు మమ్మల్ని సజ్జనుల సహచర్యం లో చేరుస్తాడన్న ఆశ మాకుంది".

(అల్ మాయిదా: 83,84)

ఏమిటీ ఆ సత్యవాక్కు?

సకల చరాచర సృష్టికి మూలాధార మైన అల్లాహ్‌యే ఆరాధ్య దైవం. ఆయన తప్ప వేరెవ్వరూ ఆరాధ్యులు కారు. అల్లాహ్ తన దాసులైన మాన వులకు సన్మార్గం చూపటానికి తన ప్రవక్తలను పంపాడు. ఆ ప్రవక్తలపై తన గ్రంథాలను అవతరింపజేశాడు. మర్యమ్ కుమారుడైన ఈసా (యేసు – అ) కూడా మానవుడే. అల్లాహ్ భక్తుడే (అబ్దుల్లాహ్‌యే). అల్లాహ్ ఆయన్ని తన ప్రవక్తగా ఎన్నుకుని, శక్తివంత మైన కొన్ని మహిమల్ని ఇచ్చాడు.

"మర్యమ్ పుత్రుడవైన ఓ ఈసా! అల్లాహ్‌ను వదలి 'నన్నూ, నా తల్లిని' ఆరాధ్య దైవాలుగా చేసుకోండి అని నీవు జనులకు చెప్పితివా?" అని అల్లాహ్ నిలదీసి అడిగే సందర్భం కూడా స్మరించదగినదే. అప్పుడు ఈసా ఇలా విన్నవించుకుంటారు: '(ఓ అల్లాహ్!) నిన్ను పరమ పవిత్రునిగా భావిస్తున్నాను. ఏ మాటను అనే హక్కు నాకు లేదో దానిని అనటం నాకే మాత్రం తగదు. ఒకవేళ నేను గనక అలాంటిదేదైనా అనివుంటే అది నీకు తెలిసి ఉండేది. నా మనసులో ఏముందో కూడా నీకు తెలుసు. కాని నీలో ఏముందో నాకు తెలీదు. నిశ్చయంగా నీవు సమస్త విషయాలను తెలిసినవాడవు". (5:116)

క్రైస్తవుల్లోని సత్య ప్రేమికుల వైఖరి

యేసు క్రీస్తు (ఈసా అ) పునరాగమ నాన్ని గురించి ఇంత ఖచ్చితంగా చెప్పిన ఆ (ముహమ్మద్) ప్రవక్త (స) పట్ల, ఆ ప్రవక్త అనుయాయులైన ముస్లింల పట్ల క్రైస్తవుల్లోని ఒక వర్గం మృదు వైఖరినే అవలంబించింది. ఎందుకంటే వారిలో పండితులు, భవబంధాలకు దూరంగా ఉన్న మతాచార్యులు ఉన్నారు. వేరితరుల తో పోల్చుకున్నప్పుడు వారిలో అహం కారం కనబడదు. పైగా (ఖుర్‌ఆన్ లోని) సత్యవాక్కుని విన్నప్పుడు వారి గుండెలు కరిగి, కన్నీళ్ళ రూపంలో ప్రవహిస్తాయి. వారు ఈ విధంగా పలికినందుకుగాను అల్లాహ్ వారికి క్రింద కాలువలు ప్రవ హించే స్వర్గవనాలను ప్రసాదిస్తాడు. వారందులో కలకాలం ఉంటారు. సజ్జ నులకు ఇలాంటి ప్రతిఫలమే లభిస్తుంది.

ముగింపు

"ఇదీ మర్యమ్ కుమారుడైన ఈసా (యేసుక్రీస్తు) యదార్థగాథ. ప్రజలు సంశయానికి గురై ఉన్న సత్య వాక్కు ఇదే". (మర్యమ్: 34)

తండ్రి లేకుండా యేసును పుట్టించ టాన్ని తన శక్తి సూచనగా పేర్కొ న్నాడు. యేసు (అ)పై ఇంజీల్ గ్రంథాన్ని అవతరింపజేసి, ఆయన్ని ఇస్రాయీల్ సంతతివారి వద్దకు పంపాడు. ఈ విషయాలను కాదన్న వారు సత్య తిరస్కారులుగా పరి గణించబడతారు.

నెలవంక సంపాదకునికి ఐపిసి సన్మానం

ఐపిసిలో ఏడు సంవత్సరాల సేవలను ముగించుకుని స్వదేశానికి తిరిగి వెళుతున్న **నెలవంక** సంపాదకుడు శ్రీ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్‌ను ఐపిసి సిటీ మేనేజ్‌మెంట్ 29-12-2010 వ తేదీన బుధవారం నాడు సగౌరవంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఐపిసి జనరల్ మేనేజర్ షేఖ్ జమాల్ షత్తి, నెలవంక పర్యవేక్షకులు షేఖ్ ఖాలిద్ సబ్‌ఆ (అబూ అనస్)లు అజీజుర్రహ్మాన్ సేవలను కొనియాడారు.

ఈ సన్మాన సభకు విచ్చేసిన వారిలో అబూ సవూద్, ముసాయిద్ అల్ అనజీ, పలువురు దాయీలు, సిబ్బంది కూడా ఉన్నారు. అనంతరం జమాల్ షత్తి **నెలవంక** సంపాదకునికి 'జ్ఞాపిక'ను అందజేశారు. ఐపిసి బ్రాంచీల మేనేజర్ షేఖ్ మునీఫ్ అజ్మీ తరఫున ఒక ప్రత్యేక మొమెంటో ప్రదానం చేయబడింది.

ఐపిసి మేనేజ్‌మెంట్ వారు తన పట్ల కనబరచిన ఆదరాభిమానాలకు, నిలిపిన నమ్మకానికిగాను శ్రీ అజీజుర్రహ్మాన్ కృతజ్ఞతలు తెలిపారు.





'హమ్వా' వారి వీడ్కోలు సభ

హైదరాబాద్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ (హమ్వా) ఆధ్వర్యంలో 23-12-2010 వ తేదీ గురువారం రాత్రి సాల్మియాలోని బయాన్ హోటల్‌లో **నెలవంక** సంపాదకుడు శ్రీ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ మరియు డా. గాజీలకు ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సంస్థల నాయకులు, మేధావులు, ప్రముఖులు వారి సేవలను కొనియాడారు. అనంతరం వారిరువురికీ అపురూపమైన జ్ఞాపికలను అందజేశారు.











టిఎమ్ఎ ఆధ్వర్యంలో అజీజుర్రహ్మాన్‌కి సన్మానం

30-12-2010 వ తేదీ గురువారం రాత్రి కువైట్‌లోని మర్జూఖుల్ బద్ర్ మస్జిద్‌లో తెలుగు ముస్లిం అసోసియేషన్ (టిఎంఎ) వారు నెలవంక సంపాదకుడ్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ ముహమ్మద్ హనీఫ్ గత 30 ఏండ్లుగా తెలుగు భాషా సముదాయానికి శ్రీ అజీజుర్రహ్మాన్ అందించిన సేవలను వివరించారు.

జనాబ్ ఖలీల్ బాషా, మౌలానా షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయి, మౌలానా షేఖ్ అబ్దుస్సలామ్ ఉమ్రీ తదితరులు ఆర్ద్రతతో ప్రసంగిస్తూ కువైట్‌లో అజీజుర్రహ్మాన్ పని చేసిన తీరును విశదీకరించారు. అనంతరం టిఎంఎ తరఫున ఒక జ్ఞాపికను బహూకరించారు. గత 20 ఏండ్లుగా తెలుగు ముస్లిం అసోసియేషన్‌తో తనకున్న అనుబంధాన్ని జ్ఞాపకం చేసుకుంటూ శ్రీ అజీజుర్రహ్మాన్ గారు సభికులందరికీ ధన్యవాదాలు తెలిపారు.







ఐపిసి తెలుగు విభాగం తరఫున సన్మానం

31-12-2010 వ తేదీ శుక్రవారం నాడు ఐపిసి తెలుగు ధర్మబోధకులు శ్రీ అజీజుర్రహ్మాన్‌ని సాదరంగా సన్మానించారు. ఈ సందర్భంగా మౌలానా షేఖ్ అబ్దుస్సలామ్ ఉమ్రీ, షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయీ, సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ, షేఖ్ సలీమ్ జామయి, షేఖ్ జఫ్రుల్లాహ్ ఖాన్ నద్వీ. శ్రీ నజీబ్ ఖాన్ ప్రభృతులు ఉద్వేగంగా ప్రసంగిస్తూ శ్రీ అజీజుర్రహ్మాన్ గారిలోని ప్రత్యేకతలను వివరించారు. అనంతరం ఆయనకు మొమెంటోను బహూకరించారు.

ఈ సన్మాన సభకు హాజరైన పలువురు తెలుగు శిష్యులు తమ గురువు గారి విశిష్టతను శ్లాఘించారు. సోదరులు ముహమ్మద్ అమీన్ గారు, సోదరులు కె. అబ్దుల్లాహ్ గారు, సోదరులు ముహమ్మద్ అలీ గారు తమ గురువు గారిని దుశ్శాలువతో సన్మానించారు. అనేక మంది శిష్యులు గురువుతో తమ మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. చివరిలో శ్రీ అజీజుర్రహ్మాన్ గారు అందరికీ నిండు హృదయంతో కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

నెలనెలా వెన్నెల



ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

2011 జనవరి రెండవ తేది -

ఐపిసి కార్యాలయంలో అడుగు పెట్టాను - నా ఆప్తుడు, హితుడు మౌలానా సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ గార్కి చార్జ్ ఇచ్చి పోదామని.

కాని ఆయన పరిస్థితి విచిత్రంగా ఉంది. "ఎందుకైనా మంచిది. మరో రెండు వారాలైనా ఉండి మాకు సూచనలు ఇవ్వ రాదూ!? కనీసం ఫిబ్రవరి సంచికయినా టైప్ ఆయ్యే వరకు ఆగండి...**'నెలవంక'**తో మీ అనుబంధాన్ని, అనుభూతుల్ని వివ రిస్తూ ఒక కాలమ్‌ను మొదలెట్టండి" అని బ్రతిమాలు తున్నారు **నెలవంక** ఎడిటర్ అబ్దుస్సలామ్.

నాకు ప్రియాతిప్రియమైన వ్యక్తి... ఆరేళ్ళుగా ధర్మసేవలో నాకు చేదోడువాదోడుగా నిలిచిన శ్రేయోభిలాషి... నా కలల పంట సయ్యిద్ అబ్దుస్సలామ్! ఈయన మాటను ఎలా కాదనగలను!? అందుకే నా ప్రయాణాన్ని మరో అయిదు రోజులు వాయిదా వేసుకున్నాను. ఈయన కోరిక మేరకే ఈ పంక్తులు వ్రాయటానికి సమాయత్తం అయ్యాను. దైవ చిత్తమయితే మరికొన్ని నెలలపాటు ఈ శీర్షిక **'నెలనెలా వెన్నెల'** కాయగలదని ఆశిస్తున్నా. అయితే అంతకుముందు నా ప్రియమైన పాఠకులతో విన్నవించు కోవలసిన ముఖ్యమైన విషయాలను ముందు చెప్పనివ్వండి....

ఐపిసి నుండి నన్ను రిలీవ్ చేయమని గత రమజాను నెలలో మెనేజ్‌మెంట్‌కి పదేపదే అభ్యర్థించుకున్నాను. అతి కష్టమ్మీద పెద్దలు ఆమోదించారు. మరోవైపు కాబోయే ఎడిటర్ సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ గారిని మానసికంగా ప్రిపేర్ చేయటం మొదలెట్టాను. ఆయనకు చెప్పాపెట్టకుండానే నవంబర్ సంచిక లో ఆయన్ని ఎడిటర్‌గా ఆవిష్కరించాను. సంప్రతిస్తే ఆయన ఒప్పుకోరని నాకు తెలుసు. అందుకే ఇలా చేయాల్సి వచ్చింది.

ఇంకోవైపు కువైట్‌లోని తెలుగు కమ్యూనిటీ నుంచి, ఉర్దూ జాలియా వారి నుంచి కూడా ఎంతో ఒత్తిడి వచ్చింది - నా నిర్ణయాన్ని మరి కొంత కాలంపాటు వాయిదా వేసుకోమని. వారికి నా పట్ల ఉన్న ఆప్యాయత, నమ్మకం అటువంటిది మరి! కాని ఈ జీవనయాత్రలో మనిషికున్న ఆశలు, అభిలాషలు, ఆకాంక్షలు అతన్ని ఒకే చోట కుదుటపడనీయవు. మనసు తనువు వీడే వరకూ మనిషి సాగిపోతూనే ఉంటాడు. మహా ప్రస్థానం జరిగే వరకూ మినీ ప్రస్థానాలు చేస్తూనే ఉంటాడు. కాకపోతే ఈ ప్రయాణంలో మనిషికి సదుద్దేశాలుండాలి. ఆశయాలు పవిత్రంగా ఉండాలి. లక్ష్యాలపై దృష్టిని కేంద్రీకరించి మరీ ముందుకు సాగాలి. అడుగడుగునా దైవ సహాయాన్ని అర్థిస్తూ ముందుకు పోవాలి. అల్లాహ్ ఈ సద్బుద్ధిని అందరికీ వొసగుగాక! ఏడేళ్ళ క్రితం కువైట్‌కి వచ్చినప్పుడు ఏ దుఆ చేశానో, కువైట్ నుంచి తిరిగి వెళుతున్నప్పుడు కూడా అదే దుఆ పదేపదే చేసుకుంటున్నాను -

"రబ్బీ అద్‌ఖిల్నీ ముద్‌ఖల సిద్‌ఖిన్ వ్వ అఖ్‌రిజ్‌నీ ముఖ్‌రజ సిద్‌ఖిన్ వ్వజ్‌అల్లీ మిల్ల దున్‌క సుల్తానన్ నసీరా"

(దివ్య ఖుర్‌ఆన్- 17: 80)

(ప్రభూ! నన్ను ఎక్కడకు తీసుకుని వెళ్ళినా మంచి స్థితిలోనే తీసుకుని వెళ్లు. ఎక్కడ నుంచి తీసినా మంచి స్థితిలోనే తియ్యి. నీ తరపు నుంచి ఒక అధికారాన్ని నాకు తోడ్పాటుగా పంపించు)

2003 నవంబర్ 13వ తేదీన కువైట్‌కి వచ్చినప్పుడు ఈ గడ్డపై నాకు లభించిన స్వాగత సత్కారాలు ఒక ఎత్తయితే, కువైట్ నుంచి వెళుతున్నప్పుడు లభించిన వీడ్కోలు సన్మానాలు మరో ఎత్తు. వణుకు పుట్టించే చలిలో ఇక్కడి ఆప్తులు, సంస్థలు ఇచ్చిన వెచ్చని విందులు చిరస్మరణీయంగా ఉండి పోతాయి. వారిచ్చిన యోగ్యతాపత్రాలకు, కురిపించిన ప్రశంసా వర్షానికి తడిసి ముద్దైపోయాను. ముఖ్యంగా నన్ను 'గురువు గారు!' అని పిలిచే నా శిష్యులు దుశ్శాలువాతో సత్కరించినపుడు, హృద యానికి హత్తుకున్నప్పుడు నా గుండె ద్రవించింది. ఇదంతా దైవ కృప! దైవ ధర్మ పరిచయ మార్గంలో నేను పోషించిన అత్యల్ప కృషికి ఆ కరుణామయుడు ప్రసాదిమచిన గొప్ప పురస్కారం ఇది. ఆ క్షణాన నా గురువు గారైన మౌలానా హాఫిజ్ ముహమ్మద్ తఖీయుద్దీన్ (రహ్మ.అలై) చెబుతూ ఉండే హితవులు జ్ఞప్తికి వచ్చాయి -

"ధార్మిక ప్రాతిపదికపై ఏర్పడే సంబంధ బాంధవ్యాలు పటిష్టంగా ఉంటాయి. ప్రాపంచిక ప్రయోజనాల, స్వలాభాల ఆధారంగా ఏర్పడే సంబంధాలు పేలవంగా ఉంటాయి" అన్న ఆయన మాటల మూటను నా మదిలో మరింత పదిలంగా భద్రపర్చు కున్నాను.

గత మూడు వారాలుగా కువైట్‌లో నా పరిచయ పరిధిలో ఉన్న వారంతా కురిపించిన ఆప్యాయతకు ఉక్కిరిబిక్కిరి అయ్యాను. అందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ముఖ్యంగా నన్ను సత్కరించి, సాదరంగా సాగనంపిన ఐపిసి మేనేజ్‌మెంట్‌కి, కడప ఇస్లామిక్ సోసైటి వారికి, ఇండో-కువైట్ ఫ్రెండ్‌షిప్ అసోసి యేషన్ వారికి, ఐపిసి తెలుగు ధర్మబోధకుల బృందానికి, న్యూ ముస్లిం సహోదరులకు నిండు హృదయంతో కృతజ్ఞతలు. అల్లాహ్ వీరందరికీ ఉత్తమ పుణ్యఫలాన్ని ప్రసాదించుగాక

(ఆమీన్!)



- అబుల్ హసన్

నేటి బాలలే రేపటి పౌరులు - 10

అవును, నీవు చెప్పింది నిజమే.. కానీ ఈ రోజు మనం పిక్‌నిక్ కోసం కదా వచ్చింది. ఇంకా ఆటల కార్యక్రమం కూడా ఉంది కదా. అందుకే ఆ కథను తర్వాత చెప్పుకుందాం అని కథ పూర్తి చేశాడు అలీ.

తరువాత చెప్పిన కథలో హాజ్రత్ ఇబ్రాహీమ్ (అ)కి అమ్మ సారా (అ) ద్వారా కూడా ఓ బాలుడు పుట్టాడనీ, అ బాలుని పేరు ఇస్హాఖ్ అనీ, హాజ్రత్ ఇస్మాయీల్ లాగే హాజ్రత్ ఇస్హాఖ్ (అ)ను కూడా అల్లాహ్ ప్రవక్తగా నియమించా డనీ, ఇస్హాఖ్ (అ)గారి వంశంలోనే ప్రవక్త లందరూ వచ్చారనీ, అయితే ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) మాత్రం హాజ్రత్ ఇస్మాయీల్ (అ) గారి వంశంలోంచి వచ్చారని తెలియజేశాడు అలీ.

'రండీ! ఆడుకుందాం' అని ఆహ్వానిం చాడు అలీ. 'హా, హా, హూ, హూ' అని గంతులేస్తూ పరుగెత్తారు. పిల్లలు కళ్ళెం లేని గుర్రంలాగా ఎగురుతూ, దుముకు తూ, ఆరుస్తూ ఉన్నారు. 'ఆటలు... ఆటలు...ఆటలు..' ఏ ఆట ఆడుదాం? అడిగాడు అలీ. అధికశాతం మంది క్రికెట్ అన్నారు. కొందరు మాత్రం 'పట్టుకొండి చూద్దాం!' ఆట ఆడదా మన్నారు. వారి మధ్య కాస్త అల్లరి చోటు చేసుకుమది.

పిల్లలూ! చూడండి, మనం పిక్‌నిక్‌కి వచ్చాం. అవునూ, కాదూ, ఆడతాము, ఆడము అని గొడవ పడితే మాత్రం ఇక ఇంటికే అన్నాడు అలీ. ఈ పాచిక బాగానే పని చేసింది. సద్దు మణిగింది. వద్దండి మేము కూడా క్రికెట్ ఆడుతాం అన్నారు పిల్లలు.

జట్లు ఏర్పడటానికి చాలా సేపు పట్టింది. నేను కెప్టన్ అంటే నేను కెప్టన్‌ని అని గోల చేస్తున్నారు. చివరకు అలీయే జట్లకు నాయకులుగా ఇద్దరి పేర్లు సూచించాడు. పిల్లలను రెండు జట్లుగా విడదీసి తను అంపైర్ అయ్యాడు. ఆట ఆరంభమయింది. కాని అది కూడా వీధుల్లో ఆడుకునే ఆటలాగా తయార యింది. ఏ ఒక్కరూ మాట్లాడకుండా ఆడటం లేదు ప్రతివాడు అనవసరంగా ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉన్నాడు.

ఒరేయ్! ఇర్ఫాన్ చూపించరా పఠాన్ తడాకా... ఒరేయ్ సచిన్! ఇన్కె ఛక్కె ఛుడాదేరే.. అదిగో కొట్టాడు...చౌకా.. చౌకా.. నువ్వేం క్యాచ్ పట్టగలవురా, నీ ముఖం! ఒరెయ్ జాగ్రత్తరా! వారెవా... చూడరా వాడు గీత దాటి వెళ్ళిపోతు న్నాడు. స్టంప్ ఔట్ చేయరా! నీవేదో పెద్ద మొనగాడిలా చెప్పావు...ఇప్పుడు ఏమ య్యింది... ఓడిపోయాం కదరా! ఓహ్... షిట్...!

ఇది ఆట స్థలమా లేక కూరగాయల మార్కెట్టా? వీరు క్రికెట్ ఆడుతున్నారా లేక కొంటె కూతలు కూసుకోవడంలో పోటీ పడుతున్నారా? అని అనుకున్నాడు అలీ. ఆట అయిపోయింది. గెలిచిన జట్టులోని ఒకడు 'చూశారా మా తడాకా! గెలిచాము, మేమే గెలిచాం!' అన్నాడు. ఓడిపోయిన జట్టులోని ఒకడికి కోపం వచ్చింది. వాడు దబాయించాడు. 'అవు నురా, ఓడిపోయాం. అయితే ఏం చేస్తా వేమిటి?' మొదటివాడన్నాడు-'మీరు ఓడ పోయారు. మేం గెలిచాము. ఇంకా చేసే దేమిటిరా? మిమ్మల్ని ఓడగొట్టాం! అంతే. ఓడిపోయిన వాడి ముఖం కోపంతో ఎర్ర బడింది. అతనన్నాడు: 'ఇక నోరు మూస్తావా లేదా?' లేకపోతే ఏం చేస్తా వురా? ఇదిగో ఈ రాయి చూశావుగా!... ఇప్పుడు తను ఎంటరయి వార్నింగ్ ఇవ్వకపోతే ఏకంగా వారే (యుద్ధం) జరిగే ప్రమాదం ఉందని గ్రహించిన అలీ **'ఖామోష్'** అని కాస్త బిగ్గరగానే అరి చాడు. ఆ దెబ్బతో ఎక్కడి వాళ్ళు అక్కడ గప్ చుప్ అయిపోయారు.

మీరిలా చేస్తూ ఉండటం మంచిది కాదు. ఈ కొంటె చేష్టలు మానుకోకపోతే పిక్ నిక్ విక్‌నిక్ అంతా బండ్! అందరూ అన్నారు: హాజ్రత్! హాజ్రత్! మాకు పిక్ నిక్ కావాలండి. వీళ్ళిద్దరే కదండి పోట్లా డుకున్నదీ? అందులో మా తప్పేముం దండి? సరే నేను రెండు షరతులు పెడు తున్నాను. అవి అంగీకరిస్తేనే పిక్‌నిక్ విక్ నిక్. అంగీకరిస్తామండి అన్నారు అందరూ.

అప్పుడు చెప్పాడు అలీ -

మొదటి షరతు: అటలాడేటప్పుడు అనవసరంగా ఎవరూ మాట్లాడకూడదు. **'అరే, ఏం ఓయ్'** అని సంబోధించ కూడదు. అలా చేస్తే అతను అటనుంచి ప్రక్కకు తప్పుకోవాలి. అలాగేనండి. అన్నారు అందరూ.

రెండవ షరతు: ఆటలో గెలుపోటములను స్పోర్టివ్‌గా తీసుకోవాలి. అసలు గెలుపోట ములంటూ లేవు. ఒక రోజు ఒకరు బల హీనంగా ఉండవచ్చు, మరొక రోజు మరొకరు బలహీనంగా ఉండవచ్చు, ఆట లంటే ఆటలే! ఎగరడం, దుముకటం, పరుగెత్తడం, ఆడుకోవడం, ఆనందించ డం. ఓడిపోయామని ఉడుక్కోవడం గెలి చామని గేలి చేయడం, రాళ్ళు విసురు కోవడం లాంటివి ఎందుకు? ఆట అనేది స్నేహపూరిత వాతావరణంలో దైవ ప్రీతిని కాంక్షిస్తూ ఆడితే అది కూడా ఓ ఆరాధన అవుతుంది. అసలు ఇప్పుడు ఎవరు ఫస్ట్ వచ్చారన్నది కాదు ముఖ్యం; లాస్ట్‌లో ఎవరు ఫస్ట్‌గా నిలుస్తారన్నదే ముఖ్యం. అలా కాక తలలు పగలుకొట్టుకుంటే ఆటలో అర్థం, ఆనందం ఏముంటుంది? ఈ షరతు కూడా ఒప్పుకున్నామండి.

నెలవంక ఉత్తరాలు

పది కాలాల పాటు వెలుగొందాలి!

గౌరవనీయులైన నెలవంక సంపాదకుల వారికి, అస్సలాము అలైకుమ్!

'నెలవంక' మాసపత్రిక కువైట్ నుండి వెలువడుతున్నందుకు చాలా సంతోషం. ఆంధ్ర ప్రజల కోసం మీరు అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలు మరువలేనివి. ఈ పత్రిక ద్వారా ధార్మిక విషయాలు తెలుపుతున్నందుకు ధన్యవాదాలు. పత్రికను చాలా చక్కగా ప్రచురించడం అభినందించదగిన విషయం.

వివిధ మాస, వార పత్రికలకు వ్యాసాలను అందించే నేను కువైట్ పాఠకుల కోసం సయితం కొన్ని వ్యాసాల్ని పంపాను. ప్రచురించినందుకు ధన్యుణ్ణి. నెలవంక ప్రతి నెలా అందే ఏర్పాటు ఉంటే మరింత బాగుండు. ఏది ఎలా ఉన్నా మన **నెలవంక** పది కాలాల పాటు చిరస్థాయిగా వెలుగొందాలని ఆ విశ్వ ప్రభువును ప్రార్థిస్తున్నాను.

ఇట్లు మీ శ్రేయోభిలాషి
షేఖ్ అబ్దుల్ హఖ్ – పొరుమామిళ్ళ (ఏ.పి)

ఇది నిజం!

దాదాపు ఒక ఏడాది అన్వేషణ తర్వాత నాకు సన్మార్గ భాగ్యాన్ని ప్రసాదించాడు అల్లాహ్. ఇస్లాం స్వీకరించిన కొంత కాలానికే హజ్జ్ చేసే మహా భాగ్యం లభించడం నిజంగా నా అదృష్టం.

మీఖాత్ చేరుకుని స్నానాలాచరించి, తెల్లటి రెండు దుప్పట్లు తొడుక్కుని, రెండు రకాతుల నమాజు సలిపి, ఉమ్రా సంకల్పం బూని, **లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్..** అంటూ మక్కా దిశకు సాగిపోయే ఆ దృశ్యకావ్యం వర్ణనాతీతం. కాబాకెళ్ళి ఆచరించే తవాఫ్ కానివ్వండి, సయీ కానివ్వండి మహా దొప్ప అనుభూతి. అక్కడికి వచ్చినవారిలో కల్లాకపటం లేదు. అంటరానితనం అస్పృశ్యత, నిమ్నోన్నత, కక్ష, పక్ష, విపక్ష వంటివి అసలే లేవు. ధనిక, పేద, నల్ల, తెల్ల, అరబ్బులు, అరబ్బేతరులన్న తారతమ్యం మచ్చుకైనా కనబడదు. అక్కడికి వచ్చినవారందరూ అల్లాహ్ ప్రసన్నత కోసం పాటుపడుతూ, చేసిన నిర్వాకంపై పశ్చాత్తాపం చెందుతూ, మన్నించమని అల్లాహ్‌ను వేడుకుంటున్నారు. ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా 24 గంటలు అల్లాహ్‌ను ఆరాధించడం విస్మయం కలిగిస్తుంది. ఈ క్షణం ప్రార్థన ఆగింది అనేది ఉండదు, ఇకమీద ఉండబోదు కూడా. ఈ ఘనత ఒక్క నిజ దైవం అయిన అల్లాహ్‌కు మాత్రమే ప్రత్యేకం. ఇది నిజం. ఆ దృశ్యాన్ని కళ్ళారా చూసినవారెవ్వరూ అల్లాహ్‌కు ప్రతిగా ఎవరిని కలలో కూడా దైవంగా ఊహించ లేరు. ఈ మహత్తర అవకాశం కల్పించినందుకు ఐపిసి వారికి నిండు హృదయంతో కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. అలాగే అల్లాహ్ ఐపిసిని కలకాలం పచ్చగా ఉంచాలని ప్రార్థిస్తున్నాను. ఆమీన్! **–హసన్ (డి రత్నం , హిజిన్)**

మనో నేత్రం తెరుచుకోవాలి!

మనం అద్దం ముందు నిలబడి అందమైన మన ముఖాన్ని చూసుకుని మురిసిపోతుంటాము. ఇంతటి సుందర దేహాన్ని, ఆరోగ్యాన్ని ప్రసాదించిన ఆ పరాత్పరునికే సకల విధాల ప్రశంసలు, స్తోత్రాలు.

దేవుడు మనకు పంచేంద్రియాలు, జ్ఞానేంద్రియాలను ప్రసాదించాడు. 'సర్వేంద్రియాం నయనం ప్రధానం' అన్నది మనకు తెలిసిన విషయమే. అయితే చర్మ చక్షువులతోపాటు ఆత్మ చక్షువుల (మనో నేత్రం)తో సయితం మనిషి చూడ గలగాలి. అప్పుడే అతను సత్యాన్ని గ్రహించగలడు. కాని, చాలా మంది చర్మ చక్షువులకు, అవి చూపే దృశ్యాలకు, తళుకుబెళుకుల ఇచ్చినంత ప్రాముఖ్యత ఆత్మ చక్షువులకు, అది ఆవిష్కరించే నిజాలకు ఇవ్వరు. మనిషి తన ప్రతి ఇంద్రియాన్ని మాధవుడి అన్వేషణలో వినియోగించాలి. ఆయన ఆజ్ఞల పరిధిలోనే బ్రతికేందుకు ప్రయత్నించాలి. అలా బ్రతికే సద్బుద్ధి ఒసగబడినవారు నిజంగా సౌభాగ్యవంతులు. ఎందుకంటే విశ్వాస భాగ్యానికి మించిన సౌభాగ్యం మరొకటి ఈ లోకంలో లేదు.

గతంలో నేను, నా కుటుంబీకులు మార్గం తెలియక గాఢాంధకారాల్లో కొట్టుమిట్టాడేవాళ్ళము. మా పెద నాన్న గారి పుణ్యమా అంటూ ఆయన మాకు సత్య ధర్మాన్ని బోధించారు. సన్మార్గమేదో, అపమార్గాలేవో విశదపర్చారు. ఆయన ప్రబోధనాల కన్నా ఎక్కువగా ఆయన ప్రవర్తన మమ్మల్ని ప్రభావితం చేసింది. అల్‌హమ్దులిల్లాహ్ మా కుటుంబ సభ్యులందరూ ఇస్లాం ధర్మాన్ని స్వీకరించారు. మేమందరం సత్య ధర్మంపై స్థిరంగా చిరస్థాయిగా ఉండాలని మీ అందరూ ప్రార్థించండి.

కృషి ఉంటే మనుషులు ఋషులౌతారన్నది పెద్దల మాట. మనలోని ప్రతి ఒక్కరూ శ్రమించి, కష్టించి సత్యాన్ని, చేరుకోవాలి, పాటించాలి, ఇతరులకు బోధించాలి. అల్లాహ్ ఆ సద్బుద్ధిని మనందరికీ ప్రసాదించుగాక! ఆమీన్.

– ఫాతిమా (సుమతి)



ఓ బుద్ధి జీవుల్లారా! సిద్ధం కండి!!

అది ఓ దుర్భేద్యమైన కనుమ...ప్రతి వ్యక్తీ ఆ కనుమ నుండి పయనించాల్సిందే...అక్కడ సూర్యకిరణాల వెలుతురుండదు...చంద్రుని వెన్నెల ఉండదు... మట్టే ఇల్లు...మట్టే పాన్పు... మట్టే పడక... అక్కడ చలి కాచుకునేందుకు హీటర్లుండవు... వేడిని తగ్గించే ఏర్‌కండీషన్లుండవు... ఓదార్చే ఇల్లాలుండదు... ధైర్యం చెప్పే అమ్మానాన్నలుండరు... సహాయపడే స్నేహితుడుండడు... సరిగ్గా నించోవడానికి వీలుండదు... కుర్చోవడానికి కుదరదు... అక్కడి నుంచి పారిపోవడానికి అంతకన్నా అవకాశం ఉండదు. అది మన పాలిట స్వర్గ వనాలలోని ఓ వనం కాగలదు... లేదా నరక కూపాల్లోని ఓ కూపం కాగలదు.... అది పరలోకపు తొలి మజిలి.... దాన్ని మనం దాటగలిగితే మిగతా మజిలీలన్నింటినీ అవలీలగా దాటవచ్చు... అదే సమాధి!

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (ర) కథనం: అన్సార్లలోని ఒకతను లేచి - "దైవ ప్రవక్తా! ప్రజల్లో అందరికంటే బుద్ధిమంతుడు, వివేకవంతుడు ఎవడు?" అని అడిగాడు. అందుకు దైవ ప్రవక్త (స) "మరణాన్ని అత్యధికంగా గుర్తు చేసుకునేవారు. దాని కోసం అందరింటే ఎక్కువగా సన్నాహాలు చేసుకునేవారు; వారే గొప్ప వివేచనాపరులు. ఇటు ఐహిక మేళ్ళన్నింటిని వారు తన సొంతం చేసుకున్నారు, అటు పరలోక కీర్తిప్రతిష్టలూ వారి సొంత మయ్యాయి" అని సమాధానమిచ్చారు. (తబ్రానీ)

ఈ నిలయం...కలకాలం....శ్రీ నిలయమై నిలవాలి!



కువైట్ 50వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు!!